


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్

ఆగస్టు 25 నుంచి దరఖాస్తులు.. అక్టోబర్ 11 నుంచి పరీక్షలు

- వివరాలు 5 లో..



వ్యవసాయంలో సాంకేతికత, ఆవిష్కరణలు, స్వదేశీ విత్తనాభివృద్ధికి పెద్దపీట వేసి రైతుల ఆదాయాన్ని పెంచాలి. భారత్ ఆహార అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించాలి. అమెరికా నుంచి పాప్‌కార్న్ దిగుమతి చేసుకునే స్థాయినుంచి.. అదే దేశానికి మనమే ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి.

## ప్రతి విత్తనం.. ఆత్మనిర్భర్ భారత్‌కు బీజం కావాలి


2



వాతావరణ మార్పులు, కరవు పరిస్థితులను తట్టుకునే విత్తనాల అభివృద్ధిపై శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాలి. దేశీయంగా నాణ్యమైన విత్తనాలను అభివృద్ధి చేసి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. రైతుల భాగస్వామ్యం, స్వదేశీ పరిశోధన, పరిశ్రమల పెట్టుబడులతో వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలి.

## కరవును తట్టుకునే విత్తనాలపై పరిశోధనలు సాగాలి

2



వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడించి.. మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమిప్రభుత్వ లక్ష్యం. రైతులు ఉత్పత్తిదారులుగా కాకుండా ఎంట్రప్రెన్యూర్లుగా ఎదగాలి. ప్రాసెసింగ్ పెరిగితేనే పంటలకు విలువ, రైతులకు అధిక ఆదాయం లభిస్తుంది. ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీవంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లను చేరేలా చర్యలు తీసుకుంటాం.

## ప్రపంచ మార్కెట్లకు స్వదేశీ ఉత్పత్తులు చేరుస్తాం



భారతదేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంఓ, హై-ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని సోమవారం ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తదితరులు

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు

# విలువ జోడిద్దాం

- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు


3

## శాఖల్లో సమర్థత..

# సేవల్లో నాణ్యత

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం

5



## కడప బేసిన్‌లో

# ఖనిజ నిక్షేపాలు



- రూ.లక్షల కోట్ల విలువైన సంపదగా అంచనా
- అన్వేషణకు సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐతో ఏపీ చారిత్రాత్మక ఒప్పందం: మంత్రి కొల్లు వెల్లడి

8

## ఏపీ పవన విద్యుత్ రంగంలో

# సరికొత్త శిఖరాలకు "సుజ్లాన్"



- ఎస్ 144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్లకు మంత్రి లోకేష్ చేతుల మీదుగా నేడు శ్రీకారం
- రాయదుర్గంలో రూ.10వేలకోట్లతో 1325 మెగావాట్ల విండ్ ప్రాజెక్టులు

5

నేడు అనంత జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

2

## మూడు దశాబ్దాల జాప్యాల కథ



కరవు నేలకు

## కృష్ణమ్మ పరుగులు

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- వెలిగొండ జలకళకు శ్రీకారం
- సాగు, తాగునీటికి శాశ్వత భరోసా
- ఆగస్టు 31న వెలిగొండ తొలిదశ ప్రారంభం
- 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 15.25 లక్షలమందికి తాగునీరు

కౌంట్ డౌన్ 7

6

# ప్రతి విత్తనం.. ఆత్మనిర్భర్ భారత్‌కు బీజం కావాలి

## పాప్‌కార్న్ విత్తన ఆవిష్కరణలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



నూజివీడు (చైతన్య రథం): వ్యవసాయంలో సాంకేతికత, ఆవిష్కరణలు, స్వదేశీ విత్తనాభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు దేశాన్ని ఆహారరంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం కాట్రేనిపాడులోని గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థలో సోమవారం భారతదేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంఓ, హై-ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి.. 'నేను తెలుగు అర్థం చేసుకోగలను.. కానీ మాట్లాడలేను' అంటూ సభికులను ఆకట్టుకున్నారు. రెండు నెలల క్రితం తమిళ పత్రికలో గౌర్మెట్ సంస్థ ఎండీ పట్టాభి సక్సెస్ స్టోరీని చదివానని తెలిపారు. ఒకే ఉత్పత్తికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడంతోపాటు రైతులకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్న ఆయన ప్రయత్నాలను అభినందించారు. ఒక చిన్న ఆలోచన పెద్ద లక్ష్యంగా మారాలని, స్వదేశీ పరిజ్ఞానం, స్థానిక రైతుల శ్రమతో ప్రపంచ మార్కెట్లలో భారత్ పోటీ పడేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సాంకేతికత, ఆవిష్కరణలు, స్వదేశీ విత్తనాభివృద్ధి భారత వ్యవసాయాన్ని కొత్త దిశలో నడిపించగలవని పేర్కొన్నారు.

### రైతులే దేశానికి వెన్నెముక

రైతులే దేశానికి వెన్నెముక అని పేర్కొన్న రాధాకృష్ణన్.. భారత నాగరికత, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఎంతో కీలక స్థానం ఉందన్నారు. 140 కోట్లకు పైగా జనాభావున్న భారత్ ఆహార భద్రత విషయంలో ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్పష్టం చేశారు. దేశ అవసరాలను తీర్చేస్థాయిలో ఉత్పత్తి పెంచడంతోపాటు ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతు నాటే ప్రతి విత్తనం భవిష్యత్తులో మరింత బలమైన, స్వయం సమృద్ధి సాధించిన, అభివృద్ధి చెందిన భారతానికి బీజంగా మారాలని ఆకాంక్షించారు.

భారత్ ఇంతకాలం అధిక నాణ్యత కలిగిన పాప్‌కార్న్ మొక్కజొన్న కోసం విదేశీ హైబ్రిడ్ సాంకేతికతపై ఆధారపడిందని గుర్తుచేసిన ఉపరాష్ట్రపతి.. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ హైబ్రిడ్ ఆ దిగుమతి ఆధారితతను తగ్గించడంతో పాటు విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడంలో దోహదపడుతుందని అన్నారు. భారత నేలపై అభివృద్ధి చేసిన విత్తనంతో ప్రపంచ మార్కెట్లను అందుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### 40 వేల ఎకరాల్లో 17,500 మంది రైతులు

గౌర్మెట్ పాప్‌కార్నికా ఆధ్వర్యంలో ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మందికిపైగా రైతులు దాదాపు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్న సాగు చేస్తున్నారని రాధాకృష్ణన్ తెలిపారు. ఈ రైతు కుటుంబాలు ఈ సాగు కోసం రుణాలపై ఆధారపడకుండా పంటను సాగు చేస్తున్న విషయాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు మార్కెట్ అనుసంధానం, నమ్మకమైన కొనుగోలు వ్యవస్థ, విలువ ఆధారిత వ్యవసాయం ఎంతో అవసరమని ఆయన సందేశం స్పష్టం చేసింది.

రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నమో డ్రోన్ దీదీవంటి కార్యక్రమాలు రైతులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు డ్రోన్లను అద్దెకు అందించే కార్యక్రమం కోసం మహిళా సంఘాలకు కేంద్రం రూ.1,200 కోట్లను కేటాయించిందని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్లు, ఇతర ఆధునిక సాంకేతికత వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

### పండుగలన్నీ రైతు చుట్టూనే..

జనవరి 14న దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో పంటల పండుగను జరుపుకుంటామని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సంక్రాంతి, తమిళనాడులో పొంగల్, పంజాబ్‌లో లోహిరి, అసోంలో బిహుగా పంట పండుగలను నిర్వహిస్తారని చెప్పారు. భారతీయ సంస్కృతిలో వ్యవసాయం, రైతుకు ఉన్న ప్రాధాన్యతను ఈ పండుగలు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దేవుడి కృపతో అవసరమైన వర్షాలు కురుస్తాయని, వర్షాల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. దక్షిణ భారత నదుల అనుసంధానానికి తాను మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. మహానది నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం కలగానే మిగిలిపోదని.. కొంత ఆలస్యం జరిగినా అది వాస్తవ రూపం దాలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### పాప్‌కార్న్ దిగుమతులనుంచి ఎగుమతుల దిశగా..

అమెరికానుంచి పాప్‌కార్న్ మొక్కజొన్నను దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి బయటపడి, భవిష్యత్తులో అదే దేశానికి భారత్ పాప్‌కార్న్ మొక్కజొన్నను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. రైతు పంటను కేవలం ముడి సరుకుగా కాకుండా విత్తనం నుంచి ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వరకు విలువను పెంచే వ్యవస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ముసునూరు కార్యక్రమం చాటిచెప్పిందన్నారు.

దేశీయంగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంఓ హై-ఎక్స్‌పాన్షన్ హైబ్రిడ్ విత్తనం ఈ ప్రయాణంలో మరో కీలక అడుగని పేర్కొన్నారు. 'ప్రతి విత్తనం.. బలమైన, స్వయం సమృద్ధి సాధించిన భారతానికి బీజం కావాలి' అన్న సందేశంతో ఉపరాష్ట్రపతి తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం పాప్‌కార్న్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులను ఆయన సత్కరించారు.



## కరవును తట్టుకునే విత్తనాలపై పరిశోధనలు సాగాలి

### రైతులే దేశానికి వెన్నెముక: గవర్నర్ అబ్దుల్ నజీర్

నూజివీడు (చైతన్య రథం): వాతావరణ మార్పులు, కరవు పరిస్థితులను తట్టుకుని భవిష్యత్‌లోనూ ఆహార భద్రతను కాపాడేలా శాస్త్రవేత్తలు కరవును తట్టుకునే విత్తనాల అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. వ్యవసాయం బలంగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని, రైతులే భారతదేశానికి వెన్నెముక అని ఆయన పేర్కొన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం కాట్రేనిపాడులోని గౌర్మెట్ పాప్‌కార్నికా ఫ్యాక్టరీలో సోమవారం నిర్వహించిన భారతదేశపు తొలి నాన్-జీఎంఓ, హై-ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాల ఆవిష్కరణ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి విత్తనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఇతరరంగాల్లో సంక్షోభ పరిస్థితులు ఎదురైనప్పటికీ వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని అందించిందన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ఉత్పత్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో సుమారు 17 శాతం వాటా కలిగి ఉన్నాయని తెలిపారు. అందువల్ల రైతుల సంక్షేమంతో పాటు వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

#### కరవును తట్టుకునే విత్తనాలపై దృష్టి

వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు వ్యవసాయానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ముఖ్యంగా కరవు పరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు సాధించే పంట రకాలను అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉండేలా కరవును తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేసి, వాటిని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

#### దిగుమతుల నుంచి స్వయం సమృద్ధి వైపు

ఒకప్పుడు దేశంలో అవసరమైన మొక్కజొన్నలో సుమారు 70 శాతం వరకు అర్జెంటీనా, బ్రెజిల్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని అబ్దుల్ నజీర్ గుర్తుచేశారు. దిగుమతుల కోసం చెల్లించే భారీ మొత్తాలు విదేశాలకు వెళ్లేవని, ఇప్పుడు అదే విలువ భారత రైతులకు చేరుతోందని అన్నారు. దేశీయంగా నాణ్యమైన విత్తనాలను అభివృద్ధి చేసి, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తే దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం మరింత తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ముసునూరులో ఆవిష్కరించిన నాన్-జీఎంఓ హైబ్రిడ్ విత్తనాలు దేశీయ విత్తనాభివృద్ధి, విలువ ఆధారిత వ్యవసాయానికి ఒక ఉదాహరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

#### స్వదేశీ విత్తనాలే భవిష్యత్ బాట

ముసునూరులో ఆవిష్కరించిన నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాల ద్వారా దేశీయ విత్తన సాంకేతికతకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. స్వదేశీ పరిశోధన, రైతుల భాగస్వామ్యం, పరిశ్రమల పెట్టుబడులు కలిస్తే వ్యవసాయ రంగంలో దిగుమతుల స్థానాన్ని దేశీయ ఉత్పత్తులు భర్తీ చేయగలవని పేర్కొన్నారు.

## నేడు అనంత జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ మంగళవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30కు బళ్లారి సమీపంలోని జిందాల్ విజయ్‌నగర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న మంత్రి లోకేష్.. పది గంటలకు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 మధ్యలో రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ ఎస్ 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభిస్తారు. అనంతరం రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం నల్లంపల్లివద్ద ఏర్పాటుచేసిన వేదికపై రాయదుర్గం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు.

## తమ్ముడు వసంత్ మృతి బాధాకరం మంత్రి నారా లోకేష్ విచారం



అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ సైనికుడు, మాజీ కార్పొరేటర్, చిత్తూరు టౌన్ టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి చెరుకూరి వసంత కుమార్ గుండెపోటుతో మృతి చెందడంపట్ల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "తమ్ముడు వసంత్ సేవలను స్మరిస్తూ నివాళు లర్పిస్తున్నాను. ఎంతో భవిష్యత్తు ఉన్న పసుపు సైనికుడిని కోల్పోయాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం

- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



నూజివీడు (చైతన్య రథం): మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్నికా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్నికా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్‌పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉప రాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ... "రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డనుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతులనుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్దఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇకనుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్‌కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలులాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.






## ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ

"ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామికవేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రొడెక్ట్సుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వాలాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతోపాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్‌గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు హాజరయ్యారు.










ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరులో పర్యటించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి గార్మె పాప్ కార్నికా నాన్-జీఎంవో పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఫ్యాక్టరీని, పాప్ కార్న్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, పార్థసారథి, అచ్చెన్నాయుడు, గార్మె పాప్ కార్నికా ఎండీ ఎస్‌బీపీ పట్టాభిరామారావు అధికారులు పాల్గొన్నారు.

















చైతన్యరథం

# శాఖల్లో సమర్ధత.. సేవల్లో నాణ్యత

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం



అమరావతి (చైతన్య రథం): ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్ వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్ధత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

### క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్ లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

## ఏపీ పవన విద్యుత్ రంగంలో
# సరికొత్త శిఖరాలకు "సుజ్లాన్"

- ఎస్ 144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్లకు మంత్రి లోకేష్ చేతుల మీదుగా నేడు శ్రీకారం
- రాయదుర్గం నియోజకవర్గంలో రూ.10వేలకోట్లతో 1325 మెగావాట్ల విండ్ ప్రాజెక్టులు
- 2030 నాటికి 5వేల మెగావాట్ల విండ్ ప్రాజెక్టులు లక్ష్యంగా సుజ్లాన్ ప్రణాళికలు



అమరావతి (చైతన్య రథం): పవన విద్యుత్ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న సుజ్లాన్ సంస్థ అనంతపురంజిల్లా రాయ దుర్గం నియోజకవర్గం గోవిందవాడలో రూ.10వేల కోట్లతో 1325 మెగావాట్ల సామర్థ్యంగల కొత్త విండ్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్ట బోతోంది. వీటిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేలమందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ వారి రూ.144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్లను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్నారు. సుజ్లాన్ సంస్థ ప్రస్తుతం 1700లకుపైగా మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా అవతరించింది. 2030నాటికి 5వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రూపొందించి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ భారీ పవన విద్యుత్ ప్రాజెక్టులతో కీలక ఉనికిని కలిగి ఉంది. 2004లో ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించిన సుజ్లాన్... ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం ఇప్పూరు ప్రాంతంలో రోటర్ బ్లేడ్ తయారీ యూనిట్‌ను నిర్వహిస్తూ, టాటా పవర్‌వంటి ప్రముఖ సంస్థలతో కలిసి పవన విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేస్తోంది. అనంతపురంలో అతిపెద్ద బ్లేడ్ తయారీ కేంద్రంతో ఇప్పటి వరకు రూ.12వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. దీనిద్వారా ఇప్పటికే 2,200 మంది యువతకు ఇప్పటికే ఉద్యోగాలు లభించాయి.

సుజ్లాన్ సంస్థకు 70 మందికి పైగా కీలక ఖాతాదారులున్నారు. అందులో టాటా పవర్, వారీ ఫరెవర్ ఎనర్జీస్, హీలియోస్ ఇన్ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, మైత్రా వాయు ప్రైవేట్ లిమిటెడ్, ఆరెంజ్ ఉరవకొండ విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, ఓస్ట్రో ఆంధ్రా విండ్ ప్రైవేట్ లిమిటెడ్, రీన్యూ విండ్ ఎనర్జీ (శివపూర్) ప్రైవేట్ లిమిటెడ్, పూనావాలా ఎస్టేట్ స్టడ్ అండ్ అగ్రి ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్, జిందాల్ అల్యూమినియం లిమిటెడ్, ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ వైజాగ్, యాక్సిస్ విండ్ ఫామ్స్ (అనంతపురం) ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ సంయుక్తంగా భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలో ప్రపంచస్థాయి విండ్ ఎనర్జీ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి, 12వేలమంది యువ నిపుణులకు శిక్షణ ఇస్తున్నాయి. ఇందులో 25శాతం మంది మహిళా ట్రైనీలు ఉండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 20 గిగావాట్ల పవన విద్యుత్ స్థాపన మైలురాయిని దాటిన తొలి భారతీయ కంపెనీగా నిలిచిన సుజ్లాన్... దేశీయ పవన విద్యుత్ మార్కెట్లో దాదాపు 33శాతం పైగా ఉంది. దేశంలోని ప్రతి మూడు విండ్ టర్బైన్లలో ఒకటి సుజ్లాన్‌లో తయారైందే. భారీ ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ పవన విద్యుత్ రంగం లోనూ సుజ్లాన్ సంస్థ సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది.

## ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్

**ఆగస్టు 25 నుంచి దరఖాస్తులు.. అక్టోబర్ 11 నుంచి పరీక్షలు**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (స్పెషల్ టెట్) నిర్వహించ నుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసింది. ఈవిషయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్'ఎక్స్'వేదికగా వెల్లడించారు. అర్హత కలిగిన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేటినుంచి దరఖాస్తులు

స్పెషల్ టెట్‌కు ఆగస్టు 25నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 5 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది. అక్టోబర్ 11నుంచి 21వరకు కంప్యూటర్‌ఆధారిత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో పరీక్షలుజరగనున్నాయి.ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ప్రతి పేపర్‌కు రూ.1,000 చొప్పున పరీక్ష ఫీజు నిర్ణయించారు. పేపర్-1, పేపర్-2గా పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌లో 150 బహుళైచ్ఛిక ప్రశ్నలు, 150 మార్కులు ఉంటాయి. పరీక్షకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

### అర్హత సాధించేందుకు అవకాశం

ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ అర్హతను పూర్తిచేసుకుని తమవృత్తిపరమైన ప్రయాణాన్ని మరింత ఆత్మవిశ్వాసంతో కొనసాగించేందుకు ఈ ప్రత్యేక పరీక్ష ఒక ముఖ్యమైన అవకాశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. పరీక్షకు సిద్ధమయ్యే ఉపాధ్యాయులు మాక్ టెస్టులను సాధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయులను మరింత సాధికారులుగా తీర్చిదిద్దడం ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

### సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో..

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో టెట్ అర్హత సాధించాల్సిన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు అదనపు అవకాశం కల్పించేందుకు ప్రత్యేక టెట్ నిర్వహణకు ప్రభుత్వం జూన్‌లోనే అనుమతి ఇచ్చింది. ముఖ్యంగా 2011కు ముందు నియమితులైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు నిర్ణీత గడువులోగా టెట్ అర్హత సాధించేందుకు వీలు కల్పించడమే ఈ నిర్ణయం ఉద్దేశం. సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రకారంఅర్హత సాధించేందుకు 2028 ఆగస్టు 31 వరకు గడువు ఉంది.

ఈప్రత్యేక టెట్ అర్హత ప్రస్తుతఉద్యోగంలో కొనసాగడం లేదా పదోన్నతి పొందేందుకు అవసరమైన టెట్ అర్హతను నెరవేర్చడానికి మాత్రమే వర్తిస్తుంది. భవిష్యత్ ప్రత్యక్ష నియామకాలకు దీనిని ఉపయోగించలేరు. ప్రత్యక్ష నియామకాలకు అర్హత పొందాలనుకునే వారు సాధారణ ఏపీ టెట్ లేదా సీటెట్ పరీక్షను రాయాల్సి ఉంటుంది.

### 'టీచర్లను బలోపేతం చేద్దాం'

"మన నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులకు టెట్ అర్హత నిబంధనలను పూర్తిచేసుకుని తమ వృత్తిపరమైన ప్రయాణాన్ని ఆత్మవిశ్వాసంతో కొనసాగించేందుకు ఇది ఒక మంచి అవకాశం. అర్హులైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులం దరూ ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. మాక్ టెస్టులతో సమర్థంగా సిద్ధం కావాలి. మన టీచర్లను సాధికారులుగా తీర్చిదిద్ది, ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన విద్యకు మరింత బలమైన పునాది వేద్దాం" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్పెషల్ టెట్‌కు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, మార్గదర్శకాలు పాఠశాల విద్యాశాఖ, ఏపీ టెట్ అధికారిక పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు.




**కరవు నేలకు**
## కృష్ణమ్మ పరుగులు

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- వెలిగొండ జలకళకు శ్రీకారం
- సాగు, తాగునీటికి శాశ్వత భరోసా
- ఆగస్టు 31న వెలిగొండ తొలిదశ ప్రారంభం
- 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 15.25 లక్షలమందికి తాగునీరు

కౌంట్ డౌన్ 7

*1996 మార్చి 5న.. చంద్రబాబు నాయుడు శంకుస్థాపనతో పడిన తొలి అడుగు.. 2026 ఆగస్టు 31న చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న ఘట్టంతో సాకారం కానున్న కల. కాని -మధ్యలో మూడు దశాబ్దాల నిరీక్షణ. కేంద్ర అనుమతులనుంచి నిధుల కొరత వరకు.. వెలిగొండ ప్రయాణంలో ఎదురైన అడ్డంకులు అన్నీ ఇన్నీ కావు. 1996 మార్చి 5న శంకుస్థాపన జరిగినా, ప్రాజెక్టు పనులు వెంటనే వేగం అందుకోలేదు. శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ ప్రాంతంనుంచి కృష్ణా వరద జలాలను మళ్లించే ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. నాగార్జునసాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలోకి ప్రాజెక్టు ప్రాంతం రావడంతో, వన్యప్రాణి సంరక్షణ అంశాలపై సుదీర్ఘ సమీక్షలు, అనుమతుల ప్రక్రియ ఏళ్ల తరబడి సాగింది. ఇది తొలి దశలో ప్రాజెక్టు మందగమనానికి ప్రధాన కారణాల్లో ఒకటి.*

# మూడు దశాబ్దాల జాప్యాల కథ




*1996 మార్చి 5న చారిత్రక వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు*

2001లో సాంకేతిక సలహా కమిటీ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించింది. తర్వాత సొరంగాల తవ్వకం వంటి క్లిష్టమైన పనులను విదేశీ సంస్థకు అప్పగించే ప్రయత్నం జరిగినా, అది కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రాజెక్టు మరో మూడేళ్లు మౌనంగా ఉండిపోయింది. 2004లో ప్రాజెక్టుకు మరోసారి శంకుస్థాపన చేశారు. 2005లో ప్రభుత్వం అధికారికంగా ప్రాజెక్టును చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే 2006లో వాస్తవిక నిర్మాణ పనులు మొదలయ్యాయి. అంటే తొలి శంకుస్థాపన నుంచి వాస్తవ నిర్మాణం మొదలవడానికే పదేళ్లు పట్టిందన్నమాట. ఈ పదేళ్ల కాలం అనుమతులు, సాంకేతిక అధ్యయనాలు, ప్రణాళికల మార్పులతోనే గడిచిపోయింది.

### నల్లమల కొండలు: అసలైన సవాలు

నిర్మాణం మొదలైన తర్వాత ఎదురైన అతిపెద్ద సవాలు నల్లమల కొండల మధ్య సొరంగాల తవ్వకం. సుమారు 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సొరంగాలను కొండలగుండా తవ్వాల్సి రావడం. ఇది దేశంలోనే అత్యంత క్లిష్టమైన నీటిపారుదల నిర్మాణాల్లో ఒకటిగా మారడానికి కారణమైంది. రాతి పొరల్లో వైవిధ్యం, భూగర్భ జలాల ఊటలు, పరికరాల సాంకేతిక సమస్యలు తవ్వకం వేగాన్ని తరచూ తగ్గించాయి. దీనికితోడు నిధుల కొరత, కాంట్రాక్టర్ల మార్పులు, రాజకీయ అస్థిరతవంటి అంశాలు తోడయ్యాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు నీటి వనరుల ప్రాధాన్యత మరింత పెరిగింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండ పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. 2018నాటికి మొదటి సొరంగం పనుల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. అయితే అప్పటికీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటిని అందించే స్థాయికి చేరుకోలేదు.

### 2024-25: కీలక మలుపు

తదుపరి కాలంలో సొరంగం పనులు మరింత ముందుకు సాగాయి. మొదటి సొరంగం పూర్తి కాగా, రెండో సొరంగం తవ్వకం కూడా పూర్తయ్యే దశకు చేరింది. 2024-25 నాటికి రెండు సొరంగాలకు సంబంధించిన కీలక పనులు పూర్తయ్యాయి. అయితే సొరంగాలు పూర్తవడం మాత్రమే సరిపోదు. వాటినుంచి నల్లమలసాగర్‌కు నీరు చేరేందుకు హెడ్ రెగ్యులేటర్లు, అప్రోచ్ చానల్, ఫీడర్ కెనాల్, మెయిన్ కెనాల్స్, లైనింగ్‌వంటి అనేక అనుబంధ పనులు కూడా పూర్తిచేయాల్సి వచ్చింది.

### కూటమి ప్రభుత్వం: శరవేగంతో ముందడుగు

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెలిగొండను అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుంది. సాగునీటి ప్రాజెక్టులపై అపారమైన అనుభవున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేశారు. స్వయంగా పనుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహించారు. కచ్చితమైన గడువులను నిర్దేశించారు. ఆయన సంకల్పానికి మంత్రి నిమ్మల రామానాయుడు చిత్తశుద్ధి తోడైంది. ప్రాజెక్టు ప్రాంతంలోనే ఉండి, సొరంగంలోకి స్వయంగా వెళ్లి పనుల పురోగతిని పర్యవేక్షించిన సందర్భాలు కోకొల్లలు. 2026 ఫిబ్రవరిలో మార్కాపురం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి తొలి దశను జూలైనాటికి పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీరు అందించాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. అదే సందర్భంగా రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. కేవలం ఐదు నెలల్లోనే ఫీడర్ కెనాల్ నిర్మాణం పూర్తి కావడం విశేషం. తూర్పు ప్రధాన కాలువ, గొట్టిపడియ, సుంకేసుల రెగ్యులేటర్ల పనులను ఆగస్టు 15నాటికి ముగించాలని కచ్చితమైన డెడ్‌లైన్ విధించారు.

### గత, ప్రస్తుత ప్రభుత్వాల ఖర్చు తేడా

ప్రాజెక్టుకు మొత్తం అంచనావ్యయం రూ.9,081 కోట్లుగా అధికారులు వెల్లడించారు. అయితే మునుపటి (వైసీపీ) ప్రభుత్వం హయాంలో వెలిగొండకు కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. దీనికి భిన్నంగా,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలోనే రూ.2,250కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేసినట్టు ముఖ్యమంత్రే స్వయంగా వెల్లడించారు. పనుల వేగవంతానికి ప్రత్యేకంగా రూ.3,000కోట్లు కేటాయించడంతో పాటు, ఫీడర్ కెనాల్ నిర్మాణానికి రూ.460 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేశారు.

అసెంబ్లీలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా కూడా ముఖ్యమంత్రి తన ప్రభుత్వం ఇప్పటివరకు నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021నాటికే పూర్తి కావాల్సి ఉండగా, వైసీపీ పాలకుల నిర్లక్ష్య వైఖరి.. కమిషన్లకు పడిన కక్కుర్తి.. కరవు గడ్డకు కృష్ణమ్మను పారించాలన్న సంకల్ప లోపం.. వెరసి వెలిగొండ దిగాలుగా ఉండిపోయిందన్నది బహిరంగ రహస్యం.

### ఎల్‌నినో సవాలు మధ్యే పట్టుదల

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సుమారు 50శాతం వరకు వర్షపాతం లోటు నమోదైంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగడం మామూలు విషయం కాదు. వెలిగొండ కలను తానే సాకారం చేస్తానన్న ఎన్నికల హామీ.. నిర్దుష్ట సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసి తీరాలన్న చంద్రబాబు కృతనిశ్చయం.. ఫస్ట్‌ఫేజ్‌ను ప్రారంభించుకోవడానికి రంగం సిద్ధమైంది.

మూడు దశాబ్దాల ఈసుదీర్ఘ ప్రయాణంలో అనేక ప్రభుత్వాలు, అనేక సవాళ్లు,అనేక మలుపులు చోటు చేసుకున్నాయి. కరవు ప్రాంతానికి కృష్ణమ్మను పారిస్తానని ప్రజలకు మాటిచ్చి శంకుస్థాపనకు సాహసించిన విజనరీ లీడరే.. ఇప్పుడు ప్రాజెక్టును పూర్తిచేసి చరిత్రలో శాశ్వత కీర్తి ప్రతిష్టను సాధించుకున్నారు. నీటికోసం అలమటిస్తున్న కరవు గడ్డపై కృష్ణమ్మను పరుగులు పెట్టించేందుకు.. లక్షలాది దాహార్తి ప్రాణాలకు ఉపశమనం కలిగించి.. బీడు పడిన భూములపై పచ్చదనపు సౌభాగ్యాన్ని పండించేందుకు -ఆగస్టు 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ కలను సాకారం చేయబోతున్నారు.

*(రేపటి కథనంలో: నల్లమల కొండలగుండా 18.8 కిలోమీటర్ల సొరంగాలు ఎలా తవ్వారు? అమెరికా, జర్మనీ నుంచి తెప్పించిన టీబీఎం యంత్రాల కథ, టైగర్ రిజర్వ్‌లో వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా జరిగిన నిర్మాణ విశేషాలు)*






## గొర్రెల కొనుగోలుకు కేడీసీసీ బ్యాంక్..

# రూ.12 కోట్ల రుణ సహాయం

**- ముఖ్యమంత్రి చంద్రబాబు**

**ముసునూరు పర్యటనలో అందజేత**

ముసునూరు/ఏలూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు పర్యటన సందర్భంగా సోమవారం కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో 400 మంది రైతులు, పశుపోషకులకు గొర్రెల కొనుగోలు కోసం రూ.12 కోట్ల రుణ సహాయం మంజూరు చేశారు. ఈ మేరకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాంను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కోరగా ముఖ్యమంత్రి పర్యటనలో ఈ మొత్తాన్ని మంజూరు చేశారు.

ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ రైతు కుటుంబాలకు రుణం అంటే కేవలం ఆర్థిక సహాయం కాదు.. వారి కుటుంబాల భవిష్యత్తుకు భరోసా అన్నారు. గొర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి రంగాలకు ప్రోత్సాహం అందించడం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే కేడీసీసీ బ్యాంక్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి విజ్ఞప్తికి అనుగుణంగా 400 మంది రైతులు, పశుపోషకులకు రూ.12 కోట్ల రుణ సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రతి రుణం ఒక కుటుంబానికి ఉపాధిని, ప్రతి కుటుంబానికి ఒక స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించాలన్నదే మా సంకల్పం అన్నారు. రైతు సంక్షేమం కేవలం ప్రకటనల్లో కనిపించకూడదు. రైతు కుటుంబాల చేతుల్లో ఆర్థిక సహాయంగా కనిపించాలి. బ్యాంకింగ్ సేవలను గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేసి, వారి ఆర్థిక స్వావలంబనకు అండగా నిలవడమే కేడీసీసీ బ్యాంక్ బాధ్యత. రైతులు, పశు పోషకులు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునే ప్రతి అవకాశాన్ని బ్యాంక్ ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. పశుపోషకుల అవసరాలకు అనుగుణంగా రుణ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు కేడీసీసీ బ్యాంక్ నిరంతరం కృషి చేస్తుందని నెట్టెం రఘురామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ రంగబాబు, తదితరులు పాల్గొన్నారు

# కారుమూరి అరెస్టులో రాజకీయ కక్షలు లేవు

- **మద్యం రవాణాలో రూ.వందల కోట్ల అవినీతి**
- **అవినీతిలో నిలువునా కూరుకుపోయి నేడు మొసలి కన్నీరు**
- **జైలు యాత్రలు చేస్తున్న జగన్ కారుమూరిని కూడా పరామర్శిస్తారా**
- **ధ్వజమెత్తిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ**



తణుకు (చైతన్యరథం): మద్యం రవాణా కేసు అవినీతిలో నిలువునా కూరుకుపోయిన మాజీ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు అరెస్టు వ్యవహారంలో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని కూటమి కార్యాలయంలో మీడియా సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ మద్య నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి మద్యం పేరుతో కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కారుమూరి సైతం వివిధ కంపెనీల పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని సాక్షాత్తు ఈడీ దర్యాప్తులో వెలడైందని చెప్పారు. లిక్కర్ కుంభకోణంలో రూ. 3500 కోట్లు మేర భారీ కుంభకోణానికి పాల్పడగా, లిక్కర్ రవాణాలోనూ రే.400 కోట్ల దోపిడీ జరిగిందన్నారు. ఈడీ, సిట్ దర్యాప్తు ద్వారా అక్రమాలు వెలుగుచూస్తున్నాయని చెప్పారు. కారుమూరి కుటుంబ సభ్యుల ఖాతాల్లో రూ.195 కోట్లు లావాదేవీలు జరిగాయని ఈడీ గుర్తించిందని చెప్పారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం కారుమూరి దాఖలు చేసిన బెయిల్ తిరస్కరించిందంటే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థం అవుతుందన్నారు. దీన్ని వైసీపీ నాయకులు ఎలా సమర్థించుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనం దోచుకున్న వారిని అరెస్ట్ చేస్తే బీసీ నాయకులను అణగదొక్కుతున్నారంటూ కుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని రాజకీయం చేసి దాని ద్వారా సానుభూతి పొందాలంటే రాష్ట్ర ప్రజలు, తణుకు నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. షెల్ కంపెనీల పేరుతో ఏ విధంగా దోపిడీ చేశారో ఆరు నెలల దర్యాప్తు అనంతరం విచారణ సంస్థలు కళ్ళకు కట్టినట్లుగా చెప్పాయన్నారు. ఇందులో కూటమి ప్రభుత్వానికి, తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయని చెప్పారు.

**పగులుతున్న పాపాల పుట్ట**

గత వైసీపీ హయాంలో ఎంతోమంది సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులను, మాజీ మంత్రులను అక్రమ అరెస్టులు చేసిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. కక్షపూరితంగా అరెస్టులు చేయించి ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. జైలు యాత్రలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి మాజీ మంత్రి కారుమూరిని జైలులో పరామర్శిస్తారా లేదా అనేది వేచి చూడాలని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్ కుమార్ ఇదే కేసులో రెండు నెలలుగా జైలులో ఉంటే ఇప్పటివరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు కే టాక్స్ పేరుతో ఎన్నో అక్రమాలు దోపిడీలు చేసిన కారుమూరి ఇప్పుడు పర్యవసానం అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. సిగ్గు లేకుండా మళ్లీ రోడ్లపైకి వస్తే ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. ఈడీతోపాటు అత్యున్నత న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించే విధంగా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఐదేళ్లలో చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి తప్ప ఇందులో కక్షపూరిత చర్యలు ఏమీ లేవని ఎమ్మెల్యే రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026కు

# ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

- **2,07,498 మంది క్రీడాకారుల భాగస్వామ్యంతో అరుదైన ఘనత**
- **ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి గర్వకారణం: శాప్ చైర్మన్ రవి నాయుడు**

తిరుపతి (చైతన్యరథం): అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొని అరుదైన ఘనత సాధించారు. ఇంత భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్న సందర్భంగా నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్-2026 ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి ఆర్. హరీష్ చేతుల మీదుగా సోమవారం తిరుపతిలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుకి అవార్డు, సర్టిఫికెట్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో అమరావతి చాంపియన్‌షిప్-2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొనడం, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కడం ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రవి నాయుడు తెలిపారు.

ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యత, రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభ దేశవ్యాప్తంగా చాటిచెప్పారని రవి నాయుడు అన్నారు. ఈ రికార్డు రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు మరింత స్ఫూర్తినిచ్చి, క్రీడల వైపు యువతను ఆకర్షించేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్రంలో మరిన్ని ప్రతిష్టాత్మక క్రీడా కార్యక్రమాలను నిర్వహించి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే క్రీడా రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# కడప బేసిన్‌లో రూ.లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు

- **అన్వేషణకు సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐతో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం**
- **రాష్ట్ర రూపురేఖలు మార్చేలా కూటమి సన్నాహాలు**
- **మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

హైదరాబాద్ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని కడప ప్రాంతం దేశ ఇంధన, పారిశ్రామిక రంగాల భవిష్యత్తును మార్చే ప్రధాన ఖనిజ కేంద్రంగా అవతరించబోతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సీఎస్ఐఆర్-నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇంటరాక్షన్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఆర్ అండ్ డి కేంద్రంలోని Seismology, HR-MC-ICPMS, Geothermal ల్యాబ్స్ పరిశీలించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కడప జిల్లా వేంపల్లె పరిధిలో ముఖ్యంగా తుమ్మలపల్లె ప్రాంతంలో అత్యంత విలువైన వ్యూహాత్మక ఖనిజాలైన లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ఈ నిక్షేపాల అన్వేషణ కోసం ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ వనరుల శాఖ.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐతో చారిత్రాత్మక ఒప్పందం



కుదుర్చుకుంది. సుమారు రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన నిక్షేపాలు కడప బేసిన్ వెంపల్లె ఫార్మేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి భూగర్భంలో 1000 పిపిఎం వరకు లిథియం, 250 పిపిఎం వరకు గాలియం ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన లోహాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారని మంత్రి చెప్పారు.

ఈ నిక్షేపాలను పూర్తిగా వెలికితీసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. 2027లో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు 2032 నాటికి పూర్తి కానుంది.

ఈ ఐదేళ్ల అన్వేషణ కార్యక్రమానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్' (ఎన్ఎంఈటీ)భరిస్తుంది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌పై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదు. కడప బేసిన్ పరిధిలో ఖనిజాలు ఎక్కడెక్కడ విస్తరించి ఉన్నాయో గుర్తించడానికి, లోతైన భూగర్భ పరిశోధనల కోసం అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించనున్నారు. వైమానిక భూభౌతిక సర్వేలు, శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఖనిజ లక్ష్యీకరణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ త్రీడీ సబ్ సర్ఫేస్ మోడలింగ్ చేపట్టనున్నారని మంత్రి తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్ అత్యంత కీలకం. ప్రస్తుతం భారతదేశం వీటి కోసం ఇతర దేశాల దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్' లో భాగంగా ఈ ప్రాజెక్టు దేశానికి వ్యూహాత్మక ఆస్తిగా మారబోతోంది. కేవలం ఖనిజాల తవ్వకమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న విస్తారమైన తీరప్రాంతం, ఓడరేవులు, అనుకూల పారిశ్రామిక విధానాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోనే ఖనిజ ప్రాసెసింగ్, రిఫైనింగ్, బ్యాటరీల తయారీ వంటి దిగువశ్రేణి పరిశ్రమలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తాం. తద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్, శాస్త్రవేత్త డా.బి.శ్రీనివాస్, ఇతర మైన్స్ అండ్ జియాలజీ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

## అఖండ గోదావరి ప్రాజెక్టుతో..
# గోదావరి తీరానికి పర్యాటక వైభవం

- **డిసెంబర్ నాటికి పనులు పూర్తి అవుతాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**
- **శెట్టిపేటలో ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి**

నిడదవోలు (చైతన్యరథం): గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక శోభ పరిమళించాలనే సంకల్పంతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు' పనులను మంత్రి దుర్గేష్ సోమవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు



మండలం శెట్టిపేటలో స్వయంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా అధికారులతో కలిసి పనుల నాణ్యతను, డిజైన్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రకారం పనులు జరుగుతున్న తీరును మంత్రి పర్యవేక్షించి, నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా రాజమహేంద్రవరంలో చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జ్ అభివృద్ధి, పుష్కర్ ఘాట్ పునర్నిర్మాణం, కడియం నర్సరీల వద్ద 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా గోదావరికి ఇటుగా ఉన్న నిడదవోలు నియోజకవర్గంలోని శెట్టిపేట గోదావరి కెనాల్ తీరంలో పర్యాటకులు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేలా బోటింగ్ పాయింట్, వే-సైడ్ రెస్టారెంట్, చిన్నారుల కోసం అధునాతన 'ప్లే జోన్', చినకాశీరేవు ఘాట్ అభివృద్ధి, తిమ్మరాజు పాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే శెట్టిపేట పర్యాటక ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తాం. 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంతో పాటు నిడదవోలు, కొవ్వూరు, తదితర ప్రాంతాలలోని ఘాట్లలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రత్యేకించి ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కి, అలాగే ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చేసిన పాపాల ఫలితమే కారుమూరి అరెస్ట్

- **అది కక్షసాధింపు ఎంతమాత్రం కాదు**
- **ఈడీ చర్యలకు కులం, రాజకీయ రంగు పులమడం అర్థరహితం**
- **గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి**

అమరావతి (చైతన్యరథం): వైసీపీ పాలనలో జరిగిన స్కామ్‌లు, అక్రమాలకు లెక్కేలేదు...ఆ దోపిడీలో భాగం పంచుకున్నందుకే ఆ పార్టీ నాయకుడు కారుమూరి నాగేశ్వరరావు అరెస్టయ్యారు.. అంతేతప్ప ఇందులో కక్షసాధింపు లేదు...చేసిన పాపాల ఫలితమేనని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కాసుల కోసం కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల తాళిబొట్లు తెంచారని విమర్శించారు. చివరికి ఇంటిలోని మహిళలను కూడా మద్యం రవాణా అవినీతి కేసులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు కులం, కక్ష అంటూ వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈడీ చర్యలకు కులం, కక్ష రంగు పూయడం అర్థరహితమని అన్నారు. దర్యాప్తును ఎదుర్కొనే ధైర్యం లేక కులం, కక్ష అంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో మద్యం విషయంలో వారు తీసుకున్న నిర్ణయాలపై ఎంత వ్యతిరేకత వ్యక్తమైందో తెలిసినా... వారి ఏకపక్ష ధోరణి మారడం లేదు. కారుమూరి నాగేశ్వరరావు సివిల్ సప్లైస్ మంత్రిగా ఉన్నారు. ఆయన చేపట్టిన అన్ని శాఖల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన కారుమూరి నాగేశ్వరరావు అవినీతి గురించి రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే మాధవి అన్నారు.

**మద్యం రవాణా స్కాంలో కారుమూరి కీలకపాత్ర**

వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ రవాణా స్కామ్‌లోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ కారుమూరి నాగేశ్వరరావును అరెస్ట్ చేసింది. మద్యం రవాణా కుంభకోణంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుటుంబానికి మద్యం రవాణా కుంభకోణంలో బెయిల్ ఇవ్వడానికి కోర్టులు కూడా నిరాకరించాయి. గతంలో ఎంపీ మిథున్ రెడ్డిది అక్రమ అరెస్ట్ అన్నారు. ఇప్పుడు కారుమూరి నాగేశ్వరరావును అరెస్ట్ చేస్తే కులం పేరు తీసుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. వైసీపీ నేతలు కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన వ్యక్తులను చట్టం అరెస్ట్ చేస్తుంటే... గొడ్డలి పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలు అంటూ మాట్లాడుతూ ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు అత్యుత్తమ సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల వారిని ఎంత మందిని అరెస్ట్ చేశారో రాష్ట్ర ప్రజలకు తెలియదా? వైసీపీ నాయకులు ఏం చేసినా తప్పు జరగలేదన్నట్లు జగన్ రెడ్డి మాట్లాడుతున్నారు. వైసీపీలో ఉంటే ఏ తప్పు చేయడానికైనా లైసెన్స్ ఉందా? వైసీపీ హయాంలో కల్తీ మద్యం తాగి మరణించిన కుటుంబాలను వైసీపీ నాయకులు పరామర్శించారా? అభివృద్ధిపైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. గతంలో అధికారంతో దుర్మార్గంగా వ్యవహరించిన తీరును వైసీపీ నాయకులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. కక్షసాధింపు చర్యలకు పాల్పడటం వైసీపీ నాయకుల ఫార్ములా. మద్యం రవాణా చార్జీలు అంతకుముందు కార్టన్‌కు రూ.13 ఉంటే.. వైసీపీ హయాంలో ఎందుకు రూ.35కు పెంచారు? ఏపీపీఎస్సీలో జరిగిన అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. తప్పులు చేసిన ప్రతిసారీ రాజకీయ



కక్షసాధింపు అంటూ వైసీపీ నాయకులు మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు, అవినీతి ఫలితంగానే ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. కారుమూరి అరెస్ట్‌ను కక్షసాధింపుగా పేర్కొనటం చూస్తుంటే వైసీపీ నాయకులకు న్యాయస్థానాలు, వ్యవస్థల పట్ల ఏమాత్రం గౌరవం లేదని స్పష్టంగా అర్థమవుతోంది. వైసీపీ నాయకులు రాజకీయ ముసుగులో ప్రజలను మబ్బుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు.

# అర్హులందరికీ సంక్షేమం

- ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- రాయలసీమ ద్రోహి జగన్
- ఐదేళ్ల పాలనలో సీమ ప్రాజెక్టులకు మొండిచేయి
- నేడు ధర్నాల పేరిట వైసీపీ నేతల డ్రామాలు
- ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



ఆలూరు (చైతన్యరథం): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రజలందరికీ అందాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని పార్టీ నేతలకు సూచించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితతో కలిసి సోమవారం మంత్రి నిమ్మల పర్యటించారు. ఆలూరులోని టీడీపీ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులు, ప్రజలతో మంత్రులు నిమ్మల, సవిత సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, ఉపాధి, సాగునీరు, తాగునీరు తదితర రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని మంత్రి తెలిపారు. పింఛన్లను పెంచి లబ్ధిదారులకు ఇంటి వద్దకే అందిస్తున్నామని, దివ్యాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ అందిస్తున్నామని వివరించారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హత కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం, మత్స్యకారులకు భరోసా, చేనేత కార్మికులకు మగ్గాల ఆధారంగా ఆర్థిక సహాయం, ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

**సీమకు జగన్ తీరని ద్రోహం**

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. రూ.53 కోట్లతో నగరడోన రిజర్వాయర్ పనులు మొదలుపెట్టాం. రూ.1607 కోట్లు కేటాయించి, వేదవతి ప్రాజెక్టు పనులు చేపట్టి, రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గొడ్డలి పార్టీనాయకులు రాయలసీమలో సాగు, తాగు నీటి కోసం మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. చరిత్రలో రాయలసీమకు ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం జగన్ చేశాడు. 2019లో 151 సీట్లతో 50 శాతం ఓట్లతో గెలిపిస్తే, 5ఏళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమకు ఏం చేశారో చెప్పే ధైర్యం లేదు. హంద్రీనీవా పనుల్లో తట్టమట్టి తీయలేదు, మోటార్లకు ఉపయోగించిన కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి ఏడాదిలోనే రూ.3850 కోట్లు ఖర్చు పెట్టి, 3800 క్యూసెక్కులు తరలించేలా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పెంచాం. గతేడాది రికార్డు స్థాయిలో 55 టీఎంసీల నీటిని రాయలసీమకు అందించాం. నీవా నదిలోకి కూడా కృష్ణా జలాలు తరలించాలనే ఉద్దేశ్యంతో రూ.1323 కోట్ల నిధులు కేటాయించాం. మల్లన్న చెంత నుండి వెంకటేశ్వరస్వామి చెంతకు కృష్ణా జలాలు తరలిస్తాం. రూ.700 కోట్లతో మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు చేపట్టాం. గోరకల్లు రిజర్వాయర్ మరమ్మత్తులు చేయాలని నిపుణులు చెప్పినా, గత వైసిపి ప్రభుత్వం 5 రూపాయలు కూడా కేటాయించలేదు. నేడు కూటమి ప్రభుత్వంలో గోరకల్లు రిజర్వాయర్ మరమ్మత్తులకు రూ.59 కోట్లు కేటాయించి పనులు చేపట్టాం. గోరకల్లు రిజర్వాయర్ కు నిధులు ఇవ్వని వైసిపి నేతలు నేడు పోతిరెడ్డిపాడు దగ్గర ఏ ముఖం పెట్టుకుని ధర్నా చేస్తారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, సిడబ్ల్యుసి హెచ్చరించినా జగన్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. నేడు కూటమి ప్రభుత్వం శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మత్తులకు రూ.203 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. రాయలసీమకు జీవనాడి అయిన తుంగభద్ర గేట్ల మరమ్మత్తులు చేయాలని చెప్పినా జగన్ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర గేటు కొట్టుకుపోతే వెంటనే స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేసి 80 టీఎంసీల నీటిని కాపాడాం. తుంగభద్ర డ్యాంకు 33 కొత్తగేట్లు ఏర్పాటు చేసి, నేడు రాయలసీమకు తాగునీటి భద్రత కల్పించాం. రాయలసీమ తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. 5ఏళ్ల వైసిపి పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు 2వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ శాఖలో రూ.27 వేల కోట్లు ఖర్చుచేస్తే, రాయలసీమ ప్రాజెక్టులకే రూ.13,500 కోట్లు ఖర్చు చేశామని మంత్రి నిమ్మల తెలిపారు.

**విద్యా వ్యవస్థ బలోపేతం**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 16,300 డీఎస్సీ పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, అవసరమైన సదుపాయాలు అందేలా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల అందుబాటు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధి**

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి తెలిపారు. రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, మౌలిక వసతులను సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**సమస్యలు గుర్తించి పరిష్కరించాలి**

ఆలూరు నియోజకవర్గంలో ప్రజలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందుతున్నాయా లేదా అన్న అంశాన్ని నిరంతరం పరిశీలించాలని, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనం పొందని వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఆలూరు నియోజకవర్గంలో దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతా క్రమాన్ని రూపొందించాలని మంత్రి తెలిపారు. సాగునీటి వనరుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాల మెరుగుదల, రహదారులు, గ్రామీణ మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల్లో అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా అమలు చేయాలని సూచించారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలని మంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, అర్హతలు, ప్రయోజనాలు, దరఖాస్తు విధానం వంటి వివరాలను క్షేత్రస్థాయిలో తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రజలకు ప్రత్యక్షంగా అందేలా ప్రతి స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ఆలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యేలా కృషి చేయాలని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, జల వనరుల శాఖ ఎస్ ఈ శైలేశ్వర్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజన్ బాబు, అనంతపురం హెచ్ఎల్‌సి ఎస్ఈ సుధాకర్ రావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్థసారథి, ఎంఐ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర్లు, కృష్ణన్న, డిఈలు షఫీ ఉల్లా , బ్రహ్మానంద రెడ్డి కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, జనసేన ఇన్చార్జ్ వెంగప్ప, బిజెపి ఇన్చార్జ్ తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

## కారుమూరికి రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు



హైదరాబాద్ (చైతన్యరథం): ఏపీ లిక్కర్ రవాణా స్కాం కేసులో అరెస్టయిన వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు హైదరాబాద్ ఈడీ కోర్టు 2 వారాల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరిని ఈడీ అధికారులు ఆదివారం కొండాపూర్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వైద్య పరీక్షలు చేయించిన ఈడీ అధికారులు కారుమూరిని సోమవారం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు సెప్టెంబర్ 7 వరకూ జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు అయ్యారు. వారిలో కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్, ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి ఉన్నారు. లిక్కర్ రవాణా టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ను ముందు పెట్టి తతంగం నడిపినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ కేసులో హవాలా లావాదేవీలపైనా ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది.

కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్ లిక్కర్ రవాణా సిండికేట్‌లో ప్రధాన లబ్ధిదారులు. రాజకీయ పలుకుబడితో లిక్కర్ రవాణా సబ్ కాంట్రాక్టులు ఇప్పించారు. శ్రీ సుదర్శన కన్‌స్ట్రక్షన్ కంపెనీని డమ్మీ సబ్ కాంట్రాక్టర్‌గా ఏర్పాటు చేశారు. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ద్వారా రవాణా కాంట్రాక్ట్ పొందారు.. అసలు రవాణా పనులు ఇతర వ్యక్తులు చేశారు. లిక్కర్ రవాణా ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును పలు బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించారు. కారుమూరి, ఆయన కుమారుడు అక్రమ ఆదాయాన్ని ఆర్జించారు. శ్రీసుదర్శన కన్‌స్ట్రక్షన్ కంపెనీ నుంచి కారుమూరి కుటుంబ సభ్యులకు నేరుగా రూ.11.95 కోట్లకు పైగా బదిలీ అయింది.



**మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు పనులను వేగవంతం చేసే అంశాలపై మంత్రి ఫరూక్‌తో ఎంపీ బైరెడ్డి శబరి సమగ్రంగా చర్చించారు.**

# లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- దర్శిలో రూ.27 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం
- రూ.150 కోట్లతో నియోజకవర్గంలో విద్యుత్ అభివృద్ధి పనులు
- రాష్ట్ర అభివృద్ధి కోసం స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించాలి
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- రూపాయి పనిచేయకుండా వెలిగొండను ప్రారంభించిన ఘనత జగన్‌కే చెల్లిందని ఎద్దేవా



దర్శి (చైతన్యరథం): రాష్ట్రంలో లో ఓల్టేజీ, విద్యుత్ అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలోని శివరామపురంలో రూ.27.66 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ కింద రూ.90 కోట్లతో పనులు చేపట్టామని, విద్యుత్ శాఖకు సంబంధించి మొత్తం రూ.150 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) కింద రూ.8 వేల కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.6 వేల కోట్లతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. గతంలో అసంపూర్తిగా మిగిలిన 50 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. దర్శి నియోజకవర్గంలో రూ.50 కోట్లతో దాదాపు 4 వేల సూర్యఘర్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. బీసీలకు అదనపు సబ్సిడీతో సూర్యఘర్ కనెక్షన్లు అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజుకు 280 మిలియన్ యూనిట్లకు చేరినప్పటికీ, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచి అంతరాయాలు లేకుండా సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు.

2014-19 మధ్య టెండర్లు పిలిచిన పలు సబ్‌స్టేషన్ల నిర్మాణాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంతో విద్యుత్ వ్యవస్థలో సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి అందుబాటులో ఉన్నప్పటికీ ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్లు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

**వెలిగొండ పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే..**

రూపాయి పని చేయకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం జగన్‌కే చెల్లిందని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. పూర్తవ్వని ప్రాజెక్టును ప్రారంభించినా.. ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేదన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాల కోసం రూ.750 కోట్లు ఖర్చు చేసి వెలిగొండను పూర్తి చేసిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రెండేళ్లలోనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని మంత్రి గుర్తు చేశారు. ఒక్క రూపాయి విద్యుత్ ఛార్జీ పెంచకుండానే 13 పైసలు ట్రూ డౌన్ చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతోపాటు తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శ్రేణులన్నీ కలిసికట్టుగా పనిచేసి విజయానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీకి అవకాశం ఇస్తే మళ్లీ ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి , కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఉమ్మడి ప్రకాశం పశ్చిమ ప్రాంత ప్రజల...

## 30 ఏళ్ల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబు

- వెలిగొండ ప్రారంభోత్సవానికి ఊరు,వాడ వెల్లువలా తరలి రావాలి
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- పాలేటి గంగమ్మ తల్లికి మొక్కులు సమర్పించిన మంత్రి

కనిగిరి (చైతన్యరథం): ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో సోమవారం మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం అలవాలపాడులోని పాలేటి గంగమ్మ తల్లికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. అనంతరం నిర్వహించిన బైక్, ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు. తరువాత పీసీ పల్లిలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ, రైతులు నిర్వహించిన కోలాట ప్రదర్శనలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల మూడు దశాబ్దాల కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాకారం చేశారన్నారు. 30 ఏళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాయుడు చేతుల మీదుగానే ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి ప్రజల మోసం చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని మంత్రి తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఊరు, వాడ, గ్రామ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి డోలా పిలుపునిచ్చారు.

## రూ.7 కోట్లతో నిడదవోలుకు పుష్కర శోభ

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

నిడదవోలు (చైతన్యరథం): మునుపెన్నడూ లేని విధంగా నిడదవోలు పట్టణ రూపురేఖలను మారుస్తున్నామని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లు నిర్మిస్తూ పుష్కరాల నాటికి నిడదవోలును సుందర నందనవనంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని చినకాశీరేవు, బాసివిరెడ్డిపేట ప్రాంతాలలో గోదావరి పుష్కరాలు-2027 పనుల కింద పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరికాయ కొట్టి మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. అదే విధంగా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా పర్యాటక శాఖ ద్వారా జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు.

ఆ తర్వాత వివిధ శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చినకాశీరేవులోని శివాలయాన్ని సందర్శించారు. త్వరలోనే నిధులు సమకూర్చి సంబంధిత ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించేందుకు రూ.7కోట్లతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని వెల్లడించారు. అందులో భాగంగా రూ.2.50కోట్ల వ్యయంతో నిడదవోలులోని 11 ప్రధాన ఘాట్లను ఆధునీకరించి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రూ.1.45 కోట్ల అంచనాతో ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు, రూ. 20 లక్షలతో భక్తుల వాహనాలు నిలిపేందుకు 6 విశాలమైన పార్కింగ్ ఏరియాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.1 కోటి వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనుల్లో భాగంగా 34 టాయిలెట్ల నిర్మాణం, రూ.90 లక్షలతో సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు, రూ.50 లక్షలతో నిడదవోలు పట్టణ వ్యాప్తంగా సెంట్రల్ విద్యుత్ దీపాలంకరణ, రూ.45 లక్షలతో తాగునీటి సరఫరా కోసం 2 బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వివరించారు.రూ.30 లక్షలతో చినకాశీరేవు వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యంతో పాటు స్నానాలకు షవర్స్, రూ.1.25 కోట్లతో పిండ ప్రదానం షెడ్లు, ఘాట్ల ఆధునీకరణ, రూ.30 లక్షలతో ఫ్లోరింగ్, రివర్ ఫ్రంట్ పార్క్ అభివృద్ధి, తదితర పనులు చేస్తున్నామన్నారు. చినకాశీరేవు వద్ద రూ.4.47 కోట్ల రైల్వే నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

**రూ. 3.69 కోట్లతో టూరిజం హబ్ గా నిడదవోలు**

కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.3.69 కోట్ల అంచనాతో నిడదవోలు ప్రాంతాన్ని అఖండ గోదావరి ప్రాజెక్టులో అంతర్భాగం చేసినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ముఖ్యంగా చినకాశీరేవులోని 3 ఘాట్లలో పర్యాటక శాఖ ద్వారా శాస్కి స్కీమ్ లో భాగంగా రూ. 24 లక్షలతో దివ్యమైన 'గోదావరి హారతి' నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెట్టిపేట వద్ద 'టూరిజం హరిత రిసార్ట్' ఏర్పాటుతో పాటు చినకాశీరేవులోని పలు దేవాలయాల ఆధునీకరణ, తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ




ఆలయంలో భక్తులకు వసతి సౌకర్యాలతో పాటు అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టి కలిగిన నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ విశేష భాగస్వామ్యంతో నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని 7 ప్రధాన ఘాట్లతో పాటు ఇరిగేషన్ శాఖతో చర్చించి ఖండవల్లి, మల్లేశ్వరం ఘాట్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

**మోడల్ స్టేషన్‌గా నిడదవోలు రైల్వే జంక్షన్**

నిడదవోలు రైల్వే జంక్షన్‌ను ప్రయాణికులకు అత్యాధునిక మౌలిక వసతులతో అందుబాటులోకి తీసుకువస్తున్నందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిడదవోలు రైల్వే స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారమ్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్కలేటర్‌పై ప్రయాణించి స్టేషన్ అంతటా కలియదిరిగి అధికారులతో మాట్లాడారు.నిడదవోలు పట్టణం పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే జంక్షన్ అత్యంత కీలకమైన కేంద్రమని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రత్యేక చొరవతో రైల్వే స్టేషన్‌కు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు అభివృద్ధి, ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, ఆకర్షణీయమైన సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లతో రైల్వే స్టేషన్ పరిసరాలు పట్టణానికే శోభ తెచ్చేలా మారుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల అనేక గ్రామాలు, మండలాల ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిడదవోలు జంక్షన్‌లో ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఇప్పటికే రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టీటీ) ఎక్స్‌ప్రెస్ రైలు నిడదవోలు స్టేషన్‌లో ఆగేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సెప్టెంబర్ 6వ తేదీన ఈ రైలుకు స్వయంగా జెండా ఊపి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. విజయవాడ-భువనేశ్వర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును నిడదవోలులో నిలపడం ఇక్కడి ప్రయాణికులకు అత్యంత ఆవశ్యకమని, దీనిపై రైల్వే శాఖకు ఇప్పటికే అధికారికంగా విజ్ఞప్తి చేశామని, త్వరలోనే సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# మద్యం కుంభకోణం మూలస్థానం తాడేపల్లి ప్యాలెస్

- **దోపిడీ సూత్రధారి జగన్ రెడ్డి**
- **వేల కోట్ల దోపిడీ కోసమే మద్యం పాలసీ మార్పు**
- **అవినీతిపై విచారణ జరిపితే రాజకీయ కక్షలంటూ ఎదురుదాడి**
- **కులాలు, మతాలను అడ్డుపెట్టుకుని వీధి నాటకాలు**
- **జగన్ ధనదాహానికి పావులుగా మారి బలిపశువులైన బీసీ నేతలు**
- **మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం**



అమరావతి (చైతన్యరథం): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మద్యం కుంభకోణం దేశంలో జరిగిన అతిపెద్ద స్కామ్‌లలో ఒకటని గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగానే ఈ కుంభకోణం మొత్తం నడిచిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టడానికి 'మద్యపాన నిషేధం' చేస్తామని ఊరూరా ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక వేల కోట్ల రూపాయలు దోచుకోవడానికి వీలుగా మద్యం పాలసీని రూపొందించారని మంత్రి విమర్శించారు. మద్యం తయారీ డిస్టిలరీల నుంచి డీలర్ల నియామకం, రవాణా, హోలోగ్రామ్స్ వరకు ప్రతి దశలోనూ వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, ఆ డబ్బును రహస్య స్థావరాల్లో (డెన్స్‌లో) దాచిన తీరును ఆధారాలతో సహా ప్రజలంతా చూశారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రూ. 3,500 కోట్ల మద్యం కుంభకోణం బయటపడినా వైఎస్సార్‌సీపీ నాయకుల్లో పశ్చాత్తాపం లేదని మండిపడ్డారు. వారి హయాంలో జరిగిన దోపిడీపై ఎవరూ మాట్లాడకూడదనేది వైసీపీ నేతల ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. విచారణ జరిపి చట్ట ప్రకారం అరెస్టులు చేస్తుంటే ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందంటూ కులాలు, మతాలు, రాజకీయాలను అడ్డం పెట్టుకుని ఎదురుదాడి చేయడం వారికి అలవాటుగా మారిందన్నారు. తమకు అనుకూలంగా ఉంటే సీబీఐ, సీబీఐ విచారణ కావాలని కోరడం, అదే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా దోపిడీని బయటపెడితే రాజకీయ కక్ష అని గగ్గోలు పెట్టడం గొడ్డలి పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని మంత్రి పార్థసారథి ఎద్దేవా చేశారు.

**దోపిడీ కోసం సలహాదారులు..**

సాధారణంగా ఏ ప్రభుత్వమైనా పాలనను మెరుగుపరచడానికి, సాంకేతిక సలహాల కోసం నిపుణులను నియమించుకుంటుందని, కానీ గత ప్రభుత్వంలో దోపిడీకి మాత్రమే సలహాదారులను పెట్టుకున్నారని విమర్శించారు. మద్యం, ఇసుక దోపిడీ కోసం రాజ్ కసిరెడ్డి లాంటి వ్యక్తులను వినియోగించి, ఇతర ప్రాంతాల నుంచి అధికారులను డెప్యుటేషన్‌పై తెచ్చి అక్రమాలు చేయించారని ఆరోపించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు కుటుంబం మద్యం వ్యాపారంలో, రవాణా కాంట్రాక్టుల్లో ఉన్నట్లు స్వయంగా అంగీకరించారని గుర్తుచేశారు. వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ ప్రభుత్వ అండదండలతో, అధికారుల సహకారంతో దోపిడీకి పాల్పడటమే అసలు నేరమని స్పష్టం చేశారు. ఒక బాక్స్ రవాణాకు రూ.13 ఉండాల్సిన ఖర్చును ఏకంగా రూ. 35కి పెంచి, సుమారు రూ. 400 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో వెలుగులోకి తెచ్చాయన్నారు. ఆధారాలతో చర్యలు తీసుకుంటుంటే బలహీన వర్గాలపై దాడి అని ప్రచారం చేయడం శోచనీయమని, భవిష్యత్తులో చేసిన పాపాలు బయటకు వచ్చినప్పుడు వారిని వారు కాపాడుకోవడానికే గత ప్రభుత్వం బలహీన వర్గాల నాయకులను ఇలాంటి అవినీతి కార్యక్రమాల్లోకి లాగిందా అని ప్రజలు అనుమానిస్తున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

**నేరస్థులకు కులం ఉండదు..**

అవినీతికి పాల్పడింది బలహీన వర్గాల వారైనా, మరెవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. సమాజానికి, రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం జరిగిందా లేదా, చట్టవ్యతిరేక పనులు జరిగాయా లేదా అనే అంశాల ఆధారంగానే దర్యాప్తులు జరుగుతాయనే విషయం జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. కులాలు, మతాల ముసుగులో పాపాలను కప్పుకోవాలని చూడటం దారుణమని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫేక్ కంపెనీలను సృష్టించి, దోచుకున్న ప్రజాధనాన్ని గత ఎన్నికల్లో విచ్చలవిడిగా పంపిణీ చేశారని ఆరోపించారు. మద్యం దోపిడీ ద్వారా వచ్చిన నల్లధనాన్ని రవాణా చేసిన డ్రైవర్ల నుంచి, రహస్య స్థావరాల (డెన్ల) వరకు దర్యాప్తులో అన్నీ బయటపడ్డాయని, ఈ సొమ్మును గత ఎన్నికల్లో ఏ విధంగా వినియోగించారో సాక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. ఇంత జరిగినా కూడా 'బలహీన వర్గాలపై దాడి' అని తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాజ్ కసిరెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వ అధికారి వాసుదేవరెడ్డిని రాష్ట్రానికి తీసుకొచ్చి, వారిద్దరి ద్వారా మద్యం పాలసీలో భారీ దోపిడీ నడిపించిన తీరు సాక్ష్యాధారాలతో రుజువైందని తెలిపారు. ఈడీ, సీబీఐలు కేంద్ర పరిధిలోని స్వతంత్ర దర్యాప్తు సంస్థలని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ ఉండదని గుర్తుచేశారు. నిజంగానే ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతుంటే, కోర్టుల్లో ఎందుకు ఊరట దక్కడం లేదని మంత్రి ప్రశ్నించారు. ఒకవేళ ప్రభుత్వమే వేధింపులకు గురిచేస్తోందనేది నిజమైతే కారుమూరి నాగేశ్వరరావు కుటుంబం గానీ, రాజ్ కసిరెడ్డి గానీ సుప్రీంకోర్టు వరకు వెళ్లినప్పుడు న్యాయస్థానాలు ఎందుకు బెయిల్ ఇవ్వలేదని ప్రశ్నించారు. పక్కా సాక్ష్యాధారాలు ఉండటం వల్లే కోర్టులు సైతం ఉపశమనం ఇవ్వలేదనే నిజాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి పెద్ద పెద్ద న్యాయవాదులను నియమించుకుని కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, పక్కా సాక్ష్యాధారాలు ఉండటం వల్లే న్యాయస్థానాలు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని గుర్తుచేశారు. కోట్ల రూపాయల దోపిడీకి సంబంధించిన పక్కా ఆధారాలు ఉండటం వల్లే సుప్రీం కోర్టు సైతం రిలీఫ్ ఇవ్వలేదని తెలిపారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు న్యాయవ్యవస్థపై నమ్మకంతో బతుకుతుంటే, జగన్మోహన్ రెడ్డికి, ఆయన పార్టీకి దేశ న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన ఇసుక, మద్యం పాలసీలు ప్రజల మేలు కోసం కాదని, కేవలం జగన్మోహన్ రెడ్డి ధన దాహాన్ని తీర్చుకోవడానికేనని మంత్రి పార్థసారథి విమర్శించారు.

**బీసీ నాయకులు బలి**

పాము తన పిల్లల్ని తానే తిని ఆకలి తీర్చుకున్న చందంగా, గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి తమ పార్టీలోని బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాల నాయకులను తమ స్వార్థ దోపిడీకి పావులుగా వాడుకుని ఇప్పుడు వారిని బలిపశువుల్ని చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ పెద్దల అధికార వ్యామోహం, అవినీతి ఆలోచనల వల్లే బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీ నాయకులు బలిపశువులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి నేర చరిత్ర లేని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వంటి వారిని, వారి కుటుంబ సభ్యులను, సంస్థలను, ఆఖరికి మహిళల బ్యాంక్ ఖాతాలను సైతం ఈ మద్యం దోపిడీలో పావులుగా వాడుకున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలను రియల్ ఎస్టేట్, విదేశాల్లో మైనింగ్ వ్యాపారాలకు తరలించి, చివరకు బలహీన వర్గాల నాయకులను, సామాన్యులను నేరస్తులుగా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి కుట్రపూరిత విధానాలకే దక్కుతుందని మంత్రి పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంలో లూటీ చేసిన ప్రజాధనాన్ని ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెట్టారో, విదేశాల్లో మైనింగ్ వ్యాపారాలకు ఏ విధంగా హవాలా రూపంలో తరలించారో దర్యాప్తు సంస్థల విచారణలో సాక్ష్యాధారాలతో సహా బయటపడిందని మంత్రి తెలిపారు. ఇంత స్పష్టంగా ఆధారాలు బయటపడుతుంటే, తమ పాపాలను కప్పిపుచ్చుకోవడానికి బలహీన వర్గాల పేరిట సానుభూతి పొందేందుకు గొడ్డలి పార్టీ నాయకులు ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. తన స్వార్థం, అవినీతి కోసం విధానాలను మార్చుకుని, చివరకు ఆ పాపాలు బయటపడేసరికి బలహీన వర్గాల నాయకులను బలిపశువుల్ని చేస్తూ వారి వెనుక దాక్కోవాలని చూడటం అత్యంత దురదృష్టకరమని మంత్రి పార్థసారథి అన్నారు.

**కూటమి హయాంలో బీసీలకు అత్యున్నత గౌరవం**

కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలకు అత్యున్నత గౌరవం, రక్షణ ఉంటుందని, వారికి మేలు చేసేలా పాలసీలు రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్న వైఎస్సార్‌సీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు జగన్మోహన్ రెడ్డి విధానాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి హెచ్చరించారు. అవినీతి సొమ్ము సంపాదించేందుకు వీరిని అడ్డం పెట్టుకుని, కేసులు రాగానే 'ఏరు దాటాక తెప్ప తగలేసే' రీతిలో వారిని వదిలేసి రాజకీయ లబ్ధి కోసం కుల ముద్ర వేస్తున్నారని విమర్శించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వంలో నాణ్యత లేని, హానికరమైన నకిలీ మద్యాన్ని విక్రయించి ప్రజల ఆరోగ్యాలను తీవ్రంగా దెబ్బతీశారని ఆరోపించారు. ప్రభుత్వ ల్యాబొరేటరీ నివేదికల్లోనే ఆ మద్యం హానికరమని తేలినా ఆనాడు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దీనివల్ల వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యంపై ప్రశ్నించిన వారిపై దాడులు చేసి అణచివేసిన చరిత్ర గత ప్రభుత్వానిదేనని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'బూమ్ బూమ్', 'ప్రెసిడెంట్' పేర్లతో తీసుకొచ్చిన నాసిరకం బ్రాండ్లను తాగలేక ప్రజలు పక్క రాష్ట్రాల నుంచి మద్యాన్ని తెచ్చుకునే దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకురాని బ్రాండ్ల పేర్లను సైతం సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, మద్యం పాలసీలో ప్రజలకు నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నీ ప్రభుత్వం తీసుకోదని స్పష్టం చేశారు.

# డిసెంబర్ నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- **గృహ సముదాయంలో రూ.9.70 కోట్లతో మౌలిక సదుపాయాలు**
- **రూ.5.10 కోట్లతో అద్దంకి ఊరచెరువు అభివృద్ధి**
- **ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



అద్దంకి (చైతన్యరథం): ప్రకాశం జిల్లా అద్దంకి మున్సిపాలిటీలోని శింగరకొండ వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను డిసెంబర్ నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. టిడ్కో సముదాయంలో రూ.9.70 కోట్లతో ఏర్పాటు చేయబోయే మౌలిక సదుపాయల పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. అదే విధంగా రూ.5.10 కోట్లతో చేపట్టే ఊరచెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. 960 ఇళ్లకు పైగా ఉన్న టిడ్కో గృహ సముదాయంలో వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నామని చెప్పారు.

గృహ సముదాయాల చుట్టూ పక్కా ప్రహరీ గోడ, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటితో పాటు టిడ్కో ఇళ్ల సముదాయంలో విద్యుత్ సమస్యలు లేకుండా రూ.4.50 కోట్లతో ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను లబ్ధిదారులకు చూపించాలని ఈ సందర్భంగా గుత్తేదారులకు మంత్రి సూచించారు. అదే విధంగా అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

అమృత్ 2.0 నిధులతో ఊరచెరువును త్వరలోనే పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం, రంగు రంగుల పూల మొక్కలతో ఆ ప్రాంతంలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. అద్దంకి పట్టణాన్ని మరింత సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. అద్దంకి పట్టణ ప్రాంత సమగ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన
- రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు
- బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యం
- ఆలూరు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వచ్చే ఏడాది నుంచి ఆలూరులో బీసీ గురుకులం ప్రారంభం
- ప్రజల మెప్పు పొందుతున్న కూటమిపై జగన్‌ది ఓర్వలేనితనం
- మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు
- మంత్రి రామానాయుడితో కలిసి ఆలూరు టీడీపీ శ్రేణులతో మంత్రి సవిత భేటీ

ఆలూరు/కర్నూలు (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులపై కనీసం అవగాహన సైతం లేదన్నారు. ప్రజల మెప్పు పొందేలా పాలిస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్, ఆయన బ్యాచ్ ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగకపోయినా బురదజల్లుతున్నారని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆలూరు నియోజక వర్గంలో మంత్రి సవిత సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా ఆలూరు నియోజక వర్గంలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఒకవైపు సూపర్ సిక్స్ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే నియోజక వర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువల సహా ఇతర మౌలిక సదుపాయాలను విస్తృతంగా నిర్మిస్తున్నామన్నారు.

**ఆలూరులో బీసీ గురుకులం**

బీసీల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అత్యధిక శాతం లబ్ది పొందుతున్నది బీసీలేనన్నారు. నియోజక వర్గంలో అత్యధిక సంఖ్యలో బీసీలు ఉన్నారని, వారి బిడ్డలకు నాణ్యమైన విద్యనందించాలని స్థానిక టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి కోరారన్నారు. ఆమె వినతి మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఆలూరులో టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

**ఆ మంత్రులకు ఇరిగేషన్ పై అవగాహనే లేదు..**

రాష్ట్రంలో ఒక వైపు సంక్షేమంతో పాటు అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పనులు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమకు తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. గత ప్రభుత్వంలోని జలవనరుల శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. అటువంటి వారు రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత విమర్శించారు.



**ఓర్వలేకే మెగా డీఎస్సీపై విమర్శలు**

రాష్ట్ర ప్రజల మెప్పు పొందేలా కూటమి ప్రభుత్వం పాలిస్తుండడంతో జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మాట్లాడడానికి ఏ అంశమూ లేకపోవడంతో, మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ అంటే చంద్రబాబు అని, చంద్రబాబు అంటే డీఎస్సీ అని అన్నారు. త్వరలో మరో డీఎస్సీ కూడా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**ఆలూరులో కూటమిదే విజయం**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమిదే విజయమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి నాయకత్వంలో పసుపు శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అంతకుముందు ఆలూరు శంకులమ్మ దేవస్థానంలో మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి మంత్రి సవిత పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కార్పొరేషన్ ఛైర్మన్లు బొజ్జమ్మ సావిత్రి, పార్థమ్మ, దేవేంద్రప్ప పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఆదినారాయణ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రామోజీరావుపై విమర్శలు.. ఆకాశంపై ఉమ్మివేయడమే

*- అంబటిపై మంత్రి నిమ్మల ధ్వజం*

అమరావతి (చైతన్యరథం): విలువలతో కూడిన జీవితం గడిపిన మహనీయుడు రామోజీరావును నైతిక విలువలు ఏ మాత్రం లేని వైసీపీ నేత అంబటి రాంబాబులాంటి వారు విమర్శించడం అంటే ఆకాశంపై ఉమ్మి వేయడమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. ఈనాడు, రామోజీ ఫిల్మ్ సిటీ, ఉషాకిరణ్ మూవీస్ వంటి సంస్థల ద్వారా లక్షలాది మందికి జీవనోపాధి కల్పించడమే కాకుండా, తెలుగు వారి ప్రతిభను, ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు పద్మవిభూషణ్ రామోజీరావు అన్నారు. తెలుగు భాషకు, జర్నలిజానికి, మీడియా రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. అలాంటి మహనీయుడిని, నైతికత గురించి మాట్లాడే అర్హతే లేని అంబటి రాంబాబు వంటి వారు విమర్శించడం ఆకాశంపై ఉమ్మివేయడమే. ఈ విమర్శలను ఎలా చూడాలో ప్రజలే నిర్ణయిస్తారు. రామోజీరావు తన జర్నలిజం ద్వారా ప్రజా సమస్యలపై మాత్రమే నాయకులను నిలదీశారు. దీంతో వ్యక్తిగత ద్వేషం పెంచుకున్న వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వ కాలం వరకు ఆయనపై, ఆయన సంస్థలపై రాజకీయ కక్షతో కేసులు పెట్టి వేధించారని మేము అప్పట్లోనే ప్రశ్నించాం. ఎన్ని ఆరోపణలు, ఎన్ని కేసులు ఎదురైనా ఆయన ధైర్యంగా న్యాయపోరాటం చేశారన్నారు.



మార్గదర్శి వ్యవహారంలో ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, ఈ వ్యవహారంలో న్యాయస్థానం పలు అంశాలపై ఇచ్చిన స్పష్టతను కూడా గుర్తించాల్సి ఉంది. న్యాయవ్యవస్థ తీర్పులను రాజకీయ ప్రచారానికి అనుగుణంగా కాకుండా, పూర్తి వాస్తవాలతో చూడాలి. ముఖ్యంగా, 2006లో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై వివాదాలు వచ్చిన సమయంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడేందుకు రామోజీరావు తీసుకున్న చర్యలను కూడా గుర్తు చేసుకోవాలి. డిపాజిట్‌దారులకు ఎలాంటి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో తన ఆస్తులను సైతం పణంగా పెట్టి చెల్లింపులు చేశారు. చిరునామాలు లేని, పత్రాల సమస్యల వల్ల డిపాజిట్లు తీసుకోలేని వారికి సంబంధించిన మొత్తం కూడా ఎస్క్రో ఖాతాల్లో భద్రపరిచి ఉన్నాయి.

ఇంతటి విశ్వసనీయతను సంపాదించుకున్న రామోజీరావుని విమర్శించే ముందు అంబటి రాంబాబు తన గత పాలనను, తన శాఖ పనితీరును ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం ఎందుకు విఫలమైందో ప్రజలకు సమాధానం చెప్పాలి. పోలవరం బాధ్యతలు నిర్వహించిన మంత్రిగా ప్రాజెక్టు పురోగతిపై ప్రజలకు పూర్తి వివరాలు చెప్పాల్సిన బాధ్యత అంబటిపై ఉంది. ఒకవైపు ప్రజల సమస్యలను ప్రశ్నించిన జర్నలిస్టులపై విమర్శలు చేయడం, మరోవైపు తమ పాలనలో జరిగిన వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం ఎంతవరకు సమంజసం? ప్రజా జీవితంలో నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజల పట్ల బాధ్యత అత్యంత ముఖ్యమైనవి. రామోజీరావు సేవలను, ఆయనపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని అంబటి రాంబాబు వంటి వారి విమర్శలు ఏమాత్రం తగ్గించలేవు. రామోజీరావు స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ఎవరు ప్రజల కోసం నిలబడ్డారు.. ఎవరు అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారనే విషయం ప్రజలకే బాగా తెలుసునని మంత్రి రామానాయుడు అన్నారు.



## 29వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 2,32,568 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తంగా 81.64 లక్షల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం
- ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కొనసాగుతున్న వైనం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు... ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 29వ రోజు సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 29వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,32,568 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 81.64 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. 80 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించి, ప్రజల గడప గడపకు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత వేగంగా విస్తరిస్తోంది. టీడీపీ నాయకులు, శ్రేణులు ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి... వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యమవుతున్నారు.

### ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి అండతో...

# వైసీపీ నేత భూకబ్జా యత్నం

- రీ-సర్వేలో 60 సెంట్ల భూమి గల్లంతు
- న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం శూన్యం
- భూమి ఇప్పిస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేశారు
- నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని 7.96 ఎకరాల భూమి ఆక్రమణకు యత్నం
- రిజిస్ట్రేషన్, పాస్ పుస్తకాలు ఉన్నా రికార్డుల్లో 'సీలింగ్ ల్యాండ్'గా మార్పు
- న్యాయం చేయాలంటూ టీడీపీ నేతలకు వినతులు





– అర్జీలు స్వీకరించిన మంత్రి నారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు

అమరావతి (చైతన్యరథం): తప్పుడు రికార్డులు సృష్టించి తమ భూమిని ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిలువరించి తమకు న్యాయం చేయాలని అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం చౌడసముద్రం గ్రామానికి చెందిన ఇందుకూరి సోమశేఖర్ రెడ్డి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో విన్నవించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఏపీ శెట్టిబలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి అర్జీ ఇచ్చి తమ గ్రామంలోని సర్వే నంబర్ 231 (మొత్తం విస్తీర్ణం 3.53 ఎకరాలు) లోని భూమిని 1942లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ (నెం. 1572) ద్వారా తమ కుటుంబ పెద్దలు కొనుగోలు చేశారన్నారు. అనంతరం 1950లో జరిగిన రిజిస్టర్డ్ భాగ పరిష్కారం (డాక్యుమెంట్ నెం. 304) ప్రకారం 59 సెంట్ల భూమి మా కుటుంబానికి దక్కింది. గత కొన్ని దశాబ్దాలుగా ఈ 59 సెంట్ల భూమి మా అనుభవంలోనే ఉంది. అందులోనే పూర్వీకుల తొమ్మిది సమాధులు, ఇతర పొలాలకు నీరు పారించే పైప్‌లైన్లు ఉన్నాయి. గతంలో ఇదే సర్వే నెంబరులో జడ్పీ హైస్కూల్ కోసం తమ దాయాదులు వారి వాటాకు మించి భూమిని విక్రయించినప్పటికీ, మిగిలిన 59 సెంట్ల భూమిపై మాత్రం తమ కుటుంబానికే పూర్తి హక్కు ఉంది. అయితే స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అండదండలతో తమ దాయాది అయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బారెడ్డి, తప్పుడు రికార్డులు సృష్టించి భూమిని ఆక్రమించుకునేందుకు మండల రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న విచారణను ఏకపక్షంగా మలిచేందుకు యత్నిస్తూ, తమ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసి పొలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

కర్నూలు జిల్లా కౌతాళం మండలం ఆన్సలాభం గ్రామానికి చెందిన కె. నాగరాజు విజ్ఞప్తి చేస్తూ..తన తల్లి పేరిట తమ గ్రామంలో సర్వే నెంబర్ 430, 431, 402ల పరిధిలోని ఖాతా నెంబర్ 430, ఎల్.పి. నెంబర్ 463 లో వ్యవసాయ భూమి ఉందన్నారు. గతంలో ఉన్న రికార్డులతో పోలిస్తే, ప్రస్తుత రీ-సర్వే ప్రకారం సుమారు 60 సెంట్ల భూమి తక్కువగా చూపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత 8 నెలలుగా కౌతాళం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. ఇంతవరకు ఆన్‌లైన్‌లో మొత్తం ఆస్తి నమోదు కాలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తిరుపతి జిల్లా ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన ప్రభావతమ్మ అర్జీ ఇచ్చి..2020లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఒక వ్యక్తి దగ్గర నుంచి 2 ఎకరాల పొలం ఇప్పిస్తానని రమేష్ అనే రెవిన్యూ ఉద్యోగి నమ్మబలకటంతో రూ. 2 లక్షలు అందజేశామన్నారు. కానీ చివరకు 40 సెంట్ల భూమి మాత్రమే తమకు అప్పగించి, మిగిలిన 1.60 ఎకరాల భూమిని ఇవ్వకుండా మోసం చేశారు. మిగిలిన భూమి లేదా ఇచ్చిన డబ్బుల గురించి అడిగితే అధికారం అండతో తమపై దౌర్జన్యం చేస్తూ, ఎదురు కేసులు పెట్టిస్తున్నారు. పోలీసుల సమక్షంలో పంచాయితీ జరగ్గా.. రూ. 2 లక్షలు వడ్డీతో సహా చెల్లిస్తానని లేదా తన సొంత 20 ఎకరాల భూమిలో నుంచి 6 ఎకరాలు అగ్రిమెంట్ చేసి ఇస్తానని మాట ఇచ్చి తప్పించుకు తిరుగుతున్నాడు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం యర్రవంకపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్లు 34-1, 34-2 లలో గల 7.96 ఎకరాల భూమిని ప్రభుత్వం 30-10-1975న తమ కుటుంబానికి డి-పట్టాగా మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు దాదాపు 50 సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులమే ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. తమ కుటుంబంలో ఎవరికీ చదువు రాకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, పక్క మండలానికి చెందిన ఓబిరెడ్డి, దివంగత హరినాథ్‌రెడ్డి అనే వ్యక్తులు రెవెన్యూ అధికారుల ద్వారా అక్రమంగా పట్టాదార్ పాసుపుస్తకాలు పొంది, ఆన్‌లైన్ రికార్డులలో వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ అక్రమ పట్టాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని గత 30-40 సంవత్సరాలుగా తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్య పరిష్కారం కాలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొణిజర్ల గ్రామానికి చెందిన సాంబశివరావు అర్జీ ఇచ్చి..తమ గ్రామంలో సర్వే నెంబర్ 17/3 ఏ2లోని 8.14 సెంట్ల భూమిని 1995లో వి. రామకృష్ణ వద్ద కొనుగోలు చేశానని తెలిపారు. అనంతరం 2006లో తిరువూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. (డాక్యుమెంట్ నెం. 2676/2006). సదరు భూమికి సంబంధించి 2007లోనే గంపలగూడెం రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేశారు. గత 31 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ క్రమం తప్పకుండా నీటి తీరువా, భూమి శిస్తు చెల్లిస్తున్నాం. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వేలో ఈ భూమిని రికార్డులలో "సీలింగ్ ల్యాండ్"గా నమోదు చేశారు. అన్ని సరైన పత్రాలు, ఆధారాలు ఉన్నప్పటికీ తమ సొంత భూమిని సీలింగ్ భూమిగా చూపిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా వెల్దుర్తికి చెందిన రాములు విజ్ఞప్తి చేస్తూ.. రాఘవరెడ్డి, తాను గతంలో కలిసి పొలాల సెటిల్‌మెంట్ వ్యాపారం చేశామని తెలిపారు. ఆ సమయంలో ఇద్దరం కలిసి కొందరికి భూముల కోసం బయానాగా కొంత మొత్తం ఇచ్చాము. అయితే తనకు తీవ్ర అనారోగ్యం, కరోనా రావడంతో ఏడాది పాటు గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందాను. ఈ క్రమంలో ఆ భూమి వ్యాపారం రద్దయింది. దీంతో బయానా ఇచ్చిన మొత్తం డబ్బుల చెల్లింపు భారాన్ని నా ఒక్కడిపైనే వేసి మొత్తం చెల్లించాలంటూ నాపై రాఘవరెడ్డి ఒత్తిడి తెచ్చాడు. పెద్దల సమక్షంలో, పోలీసుల సమక్షంలో పంచాయతీలు చేసి రకరకాలుగా వేధించటంతో నాకున్న భూమిని రూ. 17 లక్షలకు అమ్మి పెద్దల సమక్షంలో మొత్తం పూర్తిగా చెల్లించాను. బాకీ మొత్తం తీరిపోయినా రాఘవరెడ్డి తన మనుషులతో ప్రతి 15 రోజులకోసారి మా ఇంటికి వచ్చి గొడవలు చేస్తూ తీవ్రంగా వేధించాడు. ఈ అవమానాలు, మనస్తాపం భరించలేక తన భార్య గుండె పగిలి చనిపోయింది. ఇంతటితో ఆగక ప్రభుత్వం నాకు ఇచ్చిన ఇంటిని కూడా ఖాళీ చేసి ఇవ్వాలని బెదిరిస్తున్నాడు. తన రాజకీయ అండదండలతో పోలీసులతో ఇబ్బందులు పెట్టిస్తున్నాడు. అంతేకాకుండా, ఆయన అనుచరుడి చేత నేను రూ. 1,50,000 బాకీ ఉన్నానంటూ తప్పుడు పిటిషన్ ఇప్పించి వేధిస్తున్నాడు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన నరసింహరాజు అర్జీ ఇచ్చి..గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 56 లో గల 3.56 ఎకరాల భూమికి సంబంధించి తమకి యాజమాన్య హక్కులు ఉన్నాయన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి తమ 3.56 ఎకరాల పట్టా భూమిని రెవెన్యూ రికార్డుల్లో సెక్షన్ 22 ఏ (నిషేధిత జాబితా) కింద దేవాదాయ శాఖ భూమిగా నమోదు చేశారు. ఇదే గ్రామంలోని సర్వే నెంబర్ 2 లో ఉన్న 3 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలుగా విక్రయించే క్రమంలో, తమ భూమిని దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చి తీవ్ర అన్యాయం చేశారు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సింగంపల్లి నూకరత్నం విజ్ఞప్తి చేస్తూ.. కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవించే తాము వ్యాపార నష్టాల నిమిత్తం నవంబర్ 2022లో వడ్డీ వ్యాపారి కిరణ్ రెడ్డి వద్ద రూ. 3 లక్షలు (నూటికి రూ. 3 చొప్పున వడ్డీకి) అప్పుగా తీసుకుని క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించామన్నారు. అయినప్పటికీ, తన తమ్ముడికి రూ. 13 లక్షలు అప్పు ఇచ్చినట్లు కిరణ్ రెడ్డి తప్పుడు లీగల్ నోటీసు పంపారు. అనంతరం సెప్టెంబర్ 2025లో కార్యాలయానికి పిలిపించి ఖాళీ ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. వివాదం పరిష్కరిస్తామని నమ్మించి, 2008లో ప్రభుత్వం మంజూరు చేసిన మోరంపూడి పరిధిలోని (ఫ్లాట్ నెం. 529/ఎ) ఇంటిని రూ. 11 లక్షలకు తనఖా చేయించుకున్నారు. ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని హామీపత్రం రాసిచ్చినప్పటికీ, దాన్ని ఉల్లంఘించి జనవరి 2026లో మరో వ్యక్తి పేరుతో నా తమ్ముడు రూ. 10 లక్షలు అప్పు తీసుకున్నట్లు ఇంకో లీగల్ నోటీసు పంపారు. గత కొద్ది రోజులుగా తన తమ్ముడి వ్యవసాయ భూమి వివరాలు సేకరించి, ఆస్తిపై దావా వేస్తామని నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన సానబోయిన చంద్రకళ అర్జీ ఇచ్చి ..తనకు సంబంధించిన రెండు సివిల్ కేసుల నిమిత్తం వరప్రసాద్ అనే న్యాయవాదికి దశలవారీగా నగదు చెల్లించానని తెలిపారు. తొలుత రూ. 1.5 లక్షలు, 2024 జూన్ 7న ఫోన్‌పే ద్వారా రూ. 10 లక్షలు, అక్టోబర్ 21న తణుకులోని హోటల్ చిట్టూరి హెరిటేజ్‌లో సాక్షుల సమక్షంలో మరో రూ. 5 లక్షల నగదుతో పాటు ఆయన ఖర్చులు అన్నీ కలిపి సుమారు రూ. 20 లక్షలు అందజేశాను. 2024 డిసెంబర్‌లో సదరు న్యాయవాది వరప్రసాద్ మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను సంప్రదించగా, కేవలం కేసు ఫైళ్లు మాత్రమే తిరిగి ఇచ్చి, చెల్లించిన నగదుపై దాటవేత ధోరణి ప్రదర్శించారు. లాయర్ సంపాదించిన ఆస్తులు, నగదును కుటుంబ సభ్యులు అనుభవిస్తూ, తమకు రావాల్సిన అడ్వాన్స్ సొమ్ము విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పంపిన లీగల్ నోటీసులను కూడా ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్నారు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన శ్రీదరపు శ్రీచిన్న విజ్ఞప్తి చేస్తూ..తన కుటుంబ సమస్యకు సంబంధించి న్యాయం కోసం గత రెండేళ్లుగా సాలూరు మండల రూరల్ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. ఎఫ్.ఐ.ఆర్. నమోదైనా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై ఉన్నతాధికారులకు, చివరికి డీజీపీ కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఎస్సై మాట్లాడిన అసభ్యకర ఆడియోలు, వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయి. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మార్కాపురం జిల్లా పామూరు మండలం తూర్పు కట్టకిందపల్లె గ్రామానికి చెందిన లక్ష్మి నరసింహారావు అర్జీ ఇచ్చి బొట్లగూడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 534/3ఏలో గల 1.31 ఎకరాల భూమికి సంబంధించి 2005 నుంచే అన్ని రికార్డులు ఉన్నాయన్నారు. ఇటీవల రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల నుంచి సదరు భూమి వివరాలు అకస్మాత్తుగా తొలగించారు. దీనిపై స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగా, పోర్టల్‌లో డేటా కనిపించడం లేదని, తామేమీ చేయలేమని సమాధానమిచ్చారు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన కలపాల వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ..పాపయ్యపాలెం రోడ్డులో ఉన్న 9 ఎకరాల బంజరు భూమిని ఎన్నో ఏళ్ల క్రితం తుప్పలు కొట్టి సాగులోకి తెచ్చుకున్నామన్నారు అయితే ఆ భూమి పంపిణీ, పట్టాల జారీలో జరిగిన అవకతవకల వల్ల తీవ్ర అన్యాయానికి గురయ్యాము. మొత్తం 9 ఎకరాల భూమిలో ప్రభుత్వం 3.02 ఎకరాలను ఒక మిలటరీ వ్యక్తికి కేటాయించింది. తమకు 2.20 ఎకరాలకు మాత్రమే పట్టా ఇచ్చి, మిగిలిన 3.80 ఎకరాలకు పట్టా ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారు. ఆ తర్వాత మిలటరీ వ్యక్తి నుంచి ఆ 3.02 ఎకరాలను కొనుగోలు చేసిన గంగాధరరావు అనే వ్యక్తి, మా ఆధీనంలో ఉన్న మిగిలిన భూమిని అక్రమంగా కబ్జా చేశాడు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో సాగునీటి రంగానిది అత్యంత కీలకమైన స్థానం. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతుకు సమయానికి నీరు అందితేనే పంట నిలుస్తుంది. వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. చెరువులు, కాలువలు, రిజర్వాయర్లు సమర్థంగా పనిచేస్తే సాగు నీటితో పాటు తాగునీరు, భూగర్భ జలాలు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, ఉపాధి అవకా శాలు మెరుగుపడతాయి. ఈ నేపథ్యంలో గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తిరిగి గాడిలో పెట్టడం నుంచి వెలిగొండ, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల వరకు పనులను వేగవంతం చేసింది. నిలిచిపోయిన కాలువలు, ఎత్తిపోతల పథకాలు, చెరువులకు పునరుజ్జీవం కల్పించడంతో పాటు ప్రతి ప్రధాన ప్రాజెక్టుకు స్పష్టమైన లక్ష్యాలు, పూర్తి గడువులు నిర్ణయించింది.

2 ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం

# ఏపీలో 'జల'సిరి

- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాగునీటి రంగానికి పునరుజ్జీవం
- మళ్లీ పరుగులు పెడుతున్న 'పోలవరం' ప్రాజెక్టు నిర్మాణం
- 'జలధార-జలహారతి'తో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యం



రాష్ట్రానికి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన తొలి క్షేత్రస్థాయి పర్యటనను పోలవరం నుంచే ప్రారంభించారు. రెండేళ్లలో పలుమార్లు ప్రాజెక్టును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆధ్వర్యంలో కెనడా, అమెరికాలకు చెందిన అంతర్జాతీయ నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వారి సలహాలతో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేశారు. అప్పర్ కాఫర్‌డ్యామ్ వద్ద బట్రెస్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేశారు. సీపేజ్‌ను తగ్గించేందుకు, నీటిని బయటకు పంపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో సబ్‌గ్రేడ్ ట్రీట్‌మెంట్, వైబ్రో కాంపాక్షన్ పనులను పూర్తిచేసి ప్రధాన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులను వేగవంతం చేశారు.

**ప్రధాన కాలువల కనెక్టివిటీ:** పోలవరం రిజర్వాయరు నుంచి కుడి కనెక్టివిటీ దాదాపు పూర్తికాగా ఎడమ కనెక్టివిటీ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ఈ పనులు పూర్తయితే గోదావరి నీటిని కృష్ణా డెల్టా, విశాఖపట్నం పరిసరాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమర్థంగా తరలించే అవకాశం ఏర్పడుతుంది. పోలవరానికి మిగిలి ఉన్న భూసేకరణలో పెద్ద భాగాన్ని గత రెండేళ్లలో పూర్తి చేశారు. నిర్వాసితుల పునరావాసం కోసం రూ.2,250 కోట్లు విడుదల చేశారు. పునరావాస కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రహదా రులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి మౌలిక వసతులను కల్పిస్తూ నిర్ణీత గడువులో పునరావాస ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**కేంద్రంతో సమన్వయం... నిధుల సమీకరణ**

పోలవరం సవరించిన అంచనా వ్యయం మొదటి దశ కింద రూ.30,436.95 కోట్లకు ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి దశలవారీగా వేల కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. గత రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పనులపై రూ.6,912 కోట్లకు పైగా ఖర్చు చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువలో సంవత్సరాలుగా నిలిచిపోయిన పనులను రూ.1,727 కోట్లతో పునః ప్రారంభించారు. ఈ కాలువ పూర్తయితే విశాఖపట్నం, అనకాపల్లి పరిసర ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా మెరుగుపడుతుంది.

**హంద్రీ-నీవా సుజల స్రవంతి**

రాయలసీమలో హంద్రీ-నీవా ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. ప్రధాన కాలువలు, పుంగనూరు-కుప్పం బ్రాంచ్ కాలువలు, సీసీ లైనింగ్ పనులను వేల కోట్ల రూపాయలతో చేపట్టారు. 2025-26లో 250 రోజుల పాటు 52 టీఎంసీల నీటిని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు తరలించారు. 530 చెరువులను నింపడంతో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోర్లకు నీటి లభ్యత మెరుగుపడింది.

**కొత్త బ్రాంచ్ కాలువలు**

మడకశిర బ్రాంచ్ కాలువ, పేరూరు బ్రాంచ్ కాలువ, అప్పర్ పెన్నార్, భైరవానితిప్ప, మూలపల్లి నుంచి కళ్యాణి డ్యామ్ వరకు నీటి సరఫరా పనులను కూడా చేపట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమలో సాగునీటి స్థిరత్వం పెరిగి ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, గ్రామీణ ఉపాధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

**ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు**

ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.3వేల కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 2028 డిసెంబరు నాటికి ప్రధాన ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వంశధార ఫేజ్-2, హిరమండలం ఎత్తిపోతల పథకం, నాగావళి-చంపావతి అనుసంధానం, మడ్డువలస రెండో దశ, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, తోటపల్లి, జంఝావతి, తారకరామ తీర్థసాగరం, వంశధార-నాగావళి అనుసంధానం, నేరడి బ్యారేజ్ వంటి ప్రాజెక్టులకు స్పష్టమైన పూర్తి గడువులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక నీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

**చింతలపూడి ఎత్తిపోతల పథకం**

చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పర్యావరణ, న్యాయపరమైన సమస్యల కారణంగా నిలిచిపోయాయి. సుప్రీం కోర్టులో స్టే సడలింపు పొందడంతో పాటు కేంద్ర పర్యావరణ శాఖ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన అనుమతుల ప్రక్రియను పూర్తి చేశారు. మొదటి దశలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని 2.10 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ప్రధాన కాలువ పనులను వేగవంతం చేశారు.

**ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ**

రాష్ట్రంలో APSIDC పరిధిలో నిర్మించిన 1,023 ఎత్తిపోతల పథకాల ద్వారా 8.42 లక్షల ఎకరాల సాగు సామర్థ్యం ఏర్పడింది. అయితే వాటిలో అనేక పథకాలు పనిచేయని లేదా పాక్షికంగా పనిచేసే స్థితిలో ఉన్నాయి. అలాంటి 623 పథకాల మరమ్మతులు, పునరుద్ధరణకు రూ.632 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వందలాది పథకాలను పదేళ్ల పాటు నిర్వహించేందుకు ప్రత్యేక ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ప్రణాళికను రూపొందించారు.

**ఇరిగేషన్ క్యాలెండర్**

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు 'ఇరిగేషన్ క్యాలెండర్' రూపొందించారు. 36 ప్రధాన ప్రాజెక్టులను 2028 డిసెంబరు నాటికి పూర్తిచేయడానికి రూ.35,555 కోట్ల పెట్టుబడి అవసరమని అంచనా వేశారు. పోలవరం, వెలిగొండ, హంద్రీ-నీవా, చింతలపూడి, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులతో పాటు గోదావరి డెల్టా ఆధునికీకరణ, వరికపూడిసెల, అప్పర్ పెన్నార్, వేదావతి, సోమశిల-స్వర్ణముఖి అనుసంధానం వంటి ప్రాజెక్టులకు కూడా పూర్తి గడువులను నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నెలవారీగా సమీక్షిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలనే విధానాన్ని అమలు చేస్తున్నారు.

**నీటి వినియోగదారుల సంఘాలకు పునరుజ్జీవం**

ఐదేళ్ల విరామం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వేలాది సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలను ఏర్పాటు చేశారు. కాలువల్లో పూడికతీత, గట్ల మరమ్మతులు, స్లూయిస్‌లు, గేట్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచారు. ప్రతి ఏడాది వందల కోట్ల రూపాయలతో నిర్వహణ, వరద నష్టం మరమ్మతు పనులను చేపడుతున్నారు. తద్వారా ప్రధాన ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు చేరే అవకాశాలు మెరుగుపడుతున్నాయి.

## జలధార-జలహారతి



వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం కారణంగా భూగర్భ జలాల పరిరక్షణ అత్యంత అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'జలధార-జలహారతి' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. చెరువుల్లో పూడికతీత, ఫీడర్ కాలువల మరమ్మతులు, ఫార్మ్ పాండ్లు, కాంటూర్ ట్రెంచ్‌లు, నీటి నిల్వ నిర్మాణాలు వంటి 77 వేలకుపైగా పనులకు అనుమతి ఇచ్చారు. రూ.3,312 కోట్లతో చేపట్టిన పనుల్లో దాదాపు 99 శాతం పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం ద్వారా చెరువుల్లో 58.56 టీఎంసీల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ అవుతుందని అంచనా. సుమారు 20.43 టీఎంసీల నీరు భూగర్భంలోకి ఇంకే అవకాశం ఏర్పడుతుంది. ఎండిపోయిన బోర్లకు తిరిగి నీరు రావడం, గ్రామాల్లో తాగునీటి పరిస్థితి మెరుగుపడటం, రైతుల విద్యుత్ ఖర్చు తగ్గడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి.



**వెలిగొండ ప్రాజెక్టు**

ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు వెలిగొండ ప్రాజెక్టు అత్యంత కీలకం. ఈ ప్రాజెక్టు ద్వారా 43.58 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించాలన్నది లక్ష్యం. గతంలో పెండింగులో ఉన్న టన్నెల్ హెడ్ రెగ్యులేటర్, కాంక్రీట్ వింగ్స్, రిటైనింగ్ వాల్స్ వంటి పనులను వేగంగా పూర్తి చేశారు. రెండో సొరంగంలో మిగిలి ఉన్న బెంచింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు లైనింగ్ పనులను కూడా తుదిదశకు తీసుకువచ్చారు. సొరంగంలో నిలిచిపోయిన టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను తొలగించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించారు. ఫీడర్ కాలువ నిర్మాణం, లైనింగ్ కోసం అదనపు నిధులను మంజూరు చేశారు. వెలిగొండ నిర్వాసితుల కోసం పునరావాస కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నారు. అవసరమైన ఆర్థిక సహాయంలో భాగంగా నిధులు విడుదల చేసి, పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల పనులను వేగవంతం చేశారు.



**డ్యామ్‌ల భద్రతకు ప్రత్యేక చర్యలు**

డ్యామ్‌ల భద్రతపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. తుంగభద్ర డ్యామ్‌లో 33 గేట్ల మార్పిడి పనులను పూర్తి చేశారు. శ్రీశైలం డ్యామ్ రక్షణ, ప్లంజ్‌పూల్ అధ్యయనాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల మార్పిడి, సోమశిల, గుండ్లకమ్మ, గోరకల్లు రిజర్వాయర్ల మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేశారు. డ్యామ్‌ల భద్రతను శాస్త్రీయంగా పరిశీలిస్తూ... భవిష్యత్‌లో ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

**రెండేళ్లలో రూ.24,611 కోట్ల వ్యయం**

గత రెండేళ్లలో జలవనరుల శాఖ పరిధిలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.24,611 కోట్లకుపైగా ఖర్చు చేశారు. ఇందులో రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు రూ.12,484 కోట్లు వెచ్చించారు. పోలవరం వంటి జాతీయ ప్రాజెక్టు నుంచి చిన్న ఎత్తిపోతల పథకాల వరకు, ప్రధాన డ్యామ్‌ల నుంచి గ్రామీణ చెరువుల వరకు ఒకేసారి పనులు చేపట్టడం ద్వారా రాష్ట్ర జలవనరుల వ్యవస్థను సమగ్రంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



# బీసీలకు 34% రిజర్వేషన్లపై హర్షం.. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

**●ఎంపీ సానా సతీష్‌బాబు కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం**



కాకినాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు కొప్పవరంలోని టీడీపీ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం బీసీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ నాయకులు మాట్లాడుతూ... బీసీలను రాజకీయాల్లోకి తీసుకువచ్చిన ఘనత, బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత ఎన్టీ రామారావుకు, తెలుగు దేశం పార్టీకే దక్కుతుందని, బీసీలను రాజకీయాల్లో కొనసాగిస్తూ వారికి అవకాశాలు కల్పిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 20 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతానికి పెంచడం ద్వారా బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. బీసీలను అక్కున చేర్చుకునే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. బలమైన బీసీ నాయకత్వాన్ని టీడీపీ ప్రోత్సహించిందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీవోల పేరుతో నాటకాలు ఆడిందని విమర్శించిన నాయకులు, కూటమి ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా అన్ని విధాలా అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే చదలవాడ

**● రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత**



నరసరావుపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు స్పష్టం చేశారు. 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన 14వ వార్డులో గడప గడపకూ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి ప్రజలు రికార్డు స్థాయి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని కొనియాడారు. ఐదేళ్లపాటు ఎన్నో కష్టనష్టాలను ఓర్చి పార్టీ జెండాను మోసిన నాయకులు, కార్యకర్తల శ్రమ, ప్రజల నమ్మకమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. గ్రామంలో చిన్న, సన్నకారు రైతులతో పాటు పూల తోటల సాగు, వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న అనేక కుటుంబాలు ఉన్నాయని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ', 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్నాయని వివరించారు. సంక్షేమ ఫలాలు అందుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

# ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

**●అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదు.. ప్రతి గ్రామాన్నీ సమానంగా అభివృద్ధి చేస్తాం: యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేకుండా, గన్నవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం రెమల్లె గ్రామంలో సోమవారం నిర్వహించిన 'రెండేళ్ల పాలన--అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా వివరించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి, రూ.7 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రెమల్లె గ్రామం నుంచి కూటమికి 195 ఓట్ల మెజారిటీ వచ్చిందని తెలిపారు. గతంలోనూ తెలుగుదేశం పార్టీకి గ్రామంలో ఆధిక్యం లభించిందని గుర్తుచేశారు. రాజకీయ పార్టీల్లో భిన్నాభిప్రాయాలు, వర్గాలు ఉండటం సహజమేనని, అయితే అంతిమంగా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. రానున్న సర్పంచి, ఎంపీటీసీ ఎన్నికల్లో గ్రామంలో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. తనకు ఓట్లు ఎక్కువగా వచ్చిన గ్రామాలకే అభివృద్ధి పరిమితం చేయకుండా, ఎన్నికల్లో ప్రతికూల ఫలితం వచ్చిన గ్రామాలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. మడిచర్ల లాంటి గ్రామంలో తనకు ప్రతికూల ఫలితం వచ్చినప్పటికీ రూ.5.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, నాగవరప్పాడులోనూ ఇదే విధంగా పనులు చేస్తున్నామని తెలిపారు.

# శ్యామలాంబ పాఠశాల నిర్మాణానికి రూ.50 వేల విరాళం

**●ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో హై మాస్ట్ లైట్లను ప్రారంభం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్యామలాంబ పాఠశాల నూతన భవన నిర్మాణానికి CSR నిధుల కింద రూ.50వేల ఆర్థిక సహాయాన్ని పిల్లి తాతారావు అందించారు. ఈ మొత్తాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా 11వ డివిజన్ ఇన్‌ఛార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. అనంతరం అప్పారావు రోడ్డులోని కోదండరామాలయం వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రతి అర్హుడికి సీఎంఆర్‌ఎఫ్ అందేలా కృషి చేస్తా

**●గుడివాడ ప్రజా వేదికలో సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల పరిశీలన**

**●బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము**



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా ఇచ్చారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సీఎంఆర్‌ఎఫ్ కోసం ఎమ్మెల్యే రామును కలిశారు. ప్రజా వేదిక కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి అర్జీ పత్రాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. దరఖాస్తుల్లో అవసరమైన పత్రాలు లేని వారికి వాటిని సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల పరిశీలన సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే రాము అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకుని... ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనారోగ్యం కారణంగా పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా గుడివాడ నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి అర్హుడికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

# మద్యం మాఫియా డాన్ జగన్ : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): మద్యం అక్రమాల వంటి దురాగతాలతో దొంగలు ముఠా నాయకుడిగా జగన్ ఎదిగారని, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దీనికి నిదర్శనమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల విషయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రిక ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరుకు రవాణాలోనూ అక్రమాలలకు ఒడిగట్టారన్నారు. మద్యం విక్రయాలలో ఇష్టారీతిగా వ్యవహరించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. గంజాయి బ్యాచ్‌ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమాల ద్వారా వచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయంలో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని, గత వైసీపీ పాలనలో యువత భవితను గంజాయి మత్తులో నాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టే రోజులు ముందున్నాయని చెప్పారు.

# ఇంటింటి ప్రచారంపై ఎమ్మెల్యే గంటా సమీక్ష



విశాఖపట్నం (చైతన్యరథం): ఇంటింటికి తెలుగుదేశం లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ వార్డులు, భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటి ప్రచారం మందకొడిగా జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఏమైనా ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. భీమిలి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని, గత ఎన్నికల్లో 93 వేల మెజారిటీ సాధించడం సహా లక్ష సభ్యత్వాలు చేసిన సంగతి గుర్తు చేశారు. ఇంటింటి ప్రచారంలో సరిగా పని చేయని బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జీలను మార్చాలన్నారు. పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, తాతారాజు అప్పారావు, కోరాడ రమణ, తమ్మిన సూరిబాబు, జీరు సత్యం, గొలగాని నరేంద్ర, పాసి త్రినాథ్, నాగోతి సత్యనారాయణ, లొడగల జానకిరాం, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పంచదార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమృత పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

●మంత్రి నారాయణకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి



చిలకలూరిపేట (చైతన్యరథం): పట్టణాభివృద్ధి విషయంలో ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి కారణమైన ప్రధాన గుత్తేదారు సంస్థ పనితీరుని గమనించాలని, అమృత్ -1 లోభాగంగా దక్కించుకున్న మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు పనుల్ని అసంపూర్తిగా వదిలేసి, తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన సంస్థ తీరుపై ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వాలని, చిలకలూరిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధుల్ని సకాలంలో మంజూరు చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి.. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చిలకలూరిపేట పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంలో యంత్రాంగం ఉదాసీనతపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజల అసంతృప్తికి కారణమైన ప్రధాన గుత్తేదారు సంస్థ పనితీరుపై సమావేశంలోనే ప్రత్తిపాటి.. మంత్రికి ఫిర్యాదు చేశారు.

**అసంపూర్తిగా ఉన్న అమృత్ తొలిదశ.. త్వరలో చేపట్టే రెండో దశ పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చూడండి**

2014-19 మధ్య అమృత్ పథకంలో చేపట్టిన ప్రధాన తాగునీటి పైప్ లైన్ ఏర్పాటులో గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంపై చిలకలూరిపేట ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. 8 సంవత్సరాలుగా పైప్ లైన్ పనులు అసంపూర్తిగా వదిలేయడం, వేసిన పైపుల నుంచి నీటి లీకేజీ సమస్యలు ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయని ప్రత్తిపాటి మంత్రి నారాయణకు తెలియచేశారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం, నిర్ణీత వ్యవధిలో పనులు జరగలేదని ప్రత్తిపాటి మంత్రికి తెలిపారు. గతంలో రోడ్లను ఇష్టానుసారం తవ్వేసి, పైపులు వేయకుండా, గుంతలు పూడ్చకుండా సదరు సంస్థ వ్యవహరించిన తీరుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అర్థం చేసుకోవాలని ప్రత్తిపాటి, మంత్రికి సూచించారు. తాజాగా అమృత్-2 పథకం పనులు మరలా అదే గుత్తేదారు సంస్థకు అప్పగిస్తే.. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

**టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లతో మాట్లాడండి**

గతంలో టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలకు ఎంపికైన లబ్ధిదారుల్లో దాదాపు 1500 మంది, వారివాటాగా చెల్లించాల్సిన సొమ్మును అప్పుడే ప్రభుత్వానికి చెల్లించారని. కానీ నాటి నుంచి నేటివరకు వారికి బ్యాంకుల రుణం మంజూరు కాలేదని సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాటి మంత్రి నారాయణ, రాష్ట్ర టిడ్కో ఎండీని కోరారు. స్థానిక బ్యాంకర్లతో మాట్లాడి, అర్హులైన ప్రతి లబ్ధిదారుకు రుణం అందేలా చూస్తానని, రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరిస్తామని మంత్రి నారాయణ, ప్రత్తిపాటికి భరోసా ఇచ్చారు.

**క్షేత్రస్థాయి పరిశీలనతో పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టండి..**

పారిశుధ్య నిర్వహణపై ప్రజలు సంతృప్తిగా లేరని, ప్రభుత్వ సమాచార సేకరణలోనూ ఈ విషయం స్పష్టమైందని, చెత్త తొలగింపు, వీధుల శుభ్రత, మురుగుకాల్వల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. శానిటేషన్.. క్లోరినేషన్‌తో పాటు.. దోమల బెడద లేకుండా చూడాలని, మురుగునీటి నిల్వ.. వ్యర్థాలతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# సత్తెనపల్లి ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి (చైతన్యరథం): ఇంటింటి ప్రచారంలో భాగంగా పట్టణం 22వ వార్డు నందు జరిగిన రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరించారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చేందుతుందని, ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి గర్వంగా వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించగలుగుతున్నామన్నారు. కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర జిల్లా, నియోజకవర్గ, పట్టణ వార్డు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కులం కార్డు వెనుక అవినీతిని దాచలేరు... చట్టం ముందు తప్పు చేసినవారు శిక్షార్హులే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): వైసీపీ నాయకులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరగని అక్రమం, జరగని కుంభకోణం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు నుంచి రేషన్ బియ్యం పంపిణీ వరకు, లిక్కర్ విధానాల నుంచి ప్రభుత్వ విభాగాల వరకు ప్రతిచోటా అవినీతి రాజ్యమేలిందన్నారు. లిక్కర్ స్కామ్‌పై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేడు ఆ అక్రమాలపై విచారణ జరుగుతుండగా, చట్టం తన పని తాను చేసుకుంటోందని పేర్కొన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిందన్నారు. ఈ కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయంపై కూడా విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని, దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన ఈడీ మరియు అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలను కూడా వైసీపీ రాజకీయ కోణంలో చూపడం విచారకరమన్నారు.

**తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షార్హులే**

కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరించడం పూర్తిగా అవాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. "తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షార్హులే. చట్టం ముందు అందరూ సమానమే. ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం లేదు. కానీ అవినీతి చేసిన వారిని చట్టం వదిలిపెట్టదు" అని గళ్ళా మాధవి అన్నారు.

# మచిలీపట్నం జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు హాజరైన దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): కొండపల్లిలో అక్రమ మైనింగ్‌ను ప్రశ్నించినందుకు 2021లో నాటి వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసుల విచారణకు మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు మచిలీపట్నంలోని 10వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో సోమవారం హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన న్యాయస్థానానికి వచ్చారు. అక్రమ మైనింగ్‌ను ప్రశ్నించినందుకు కక్ష సాధింపు ధోరణితో తమపై కేసులు నమోదు చేశారని ఈ సందర్భంగా దేవినేని ఉమ పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతును అణచివేయాలనే ఉద్దేశంతో IPC సెక్షన్లు188, 147, 148, 341, 323, 324, 307, 427, 506, 353, 332, 109, 120 (B) r/w 149 IPC, ఎక్స్‌ప్లోసివ్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ (ED Act) సెక్షన్ 3, అలాగే SC/ST (Prevention of Atrocities) Act, 2015లోని 3(1)(r), 3(2)(V) సెక్షన్ల కింద కేసులు పెట్టారని తెలిపారు.

# తాగునీటి సరఫరాను పునరుద్ధరించండి

● మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేసిన మహిళలు



ఉయ్యూరు (చైతన్యరథం): పట్టణంలో అతిసార వ్యాధి నివారణ చర్యలలో భాగంగా పైపుల ద్వారా సరఫరా అయ్యే నీటిని నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఐతే తాము నివసించే ప్రాంతానికి ట్యాంకర్ దూరంగా ఉండటం వలన వృద్ధులు, మహిళలు నీటిని తెచ్చుకోలేక పోతున్నామని, మూడు నాలుగు రోజులుగా గృహ అవసరాలకు కూడా నీరు అందటం లేదని కావున గతంలో వాలే పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ముస్లిం మహిళలు రాజేంద్రప్రసాద్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఉయ్యూరులో కొన్ని ప్రాంతాలలో వాంతులు విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలు ఉన్నాయని, నీరు కలుషితం వలన అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని భావించిన అధికారులు నీటి సరఫరా నిలిపివేసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించామని అన్నారు. ఉయ్యూరు పట్టణ ప్రజలు కాచి వడపోసిన నీటినే తాగాలని, పరిశుభ్రత పాటించాలని, పైపుల ద్వారా సరఫరా అయ్యే నీటిని ప్రస్తుతానికి గృహ అవసరాలకు మాత్రమే వాడాలని, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ వద్దు - దేశం ముద్దు నినాదంతో 9,000 కి.మీ సోలో బైక్ రైడ్

●బైక్ రైడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



మైలవరం (చైతన్యరథం): యువతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడటంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇబ్రహీంపట్నంకు చెందిన యువకుడు పల్లపు శ్రీ వేద ఆదిత్య చేపట్టిన 9,000 కిలోమీటర్ల సోలో బైక్ రైడ్‌కు మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు గారు సంఘీభావం తెలిపారు. "డ్రగ్స్ వద్దు -- దేశం ముద్దు" అనే నినాదంతో చేపట్టిన ఈ బైక్ యాత్రను సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అయిన శ్రీ వేద ఆదిత్య ఇబ్రహీంపట్నం నుంచి లడఖ్, కాశ్మీర్, కన్యాకుమారి మీదుగా తిరిగి ఇబ్రహీంపట్నం చేరుకునేలా సుమారు 23 రోజుల పాటు 9,000 కిలోమీటర్ల సోలో బైక్ రైడ్ చేపట్టారు. యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం, దేశభక్తి భావాన్ని పెంపొందించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ... యువతలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం అభినందనీయమన్నారు. యువత శక్తిని సానుకూల దిశగా మళ్లించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం జిల్లా వాసుల కల వెలుగొండ ప్రాజెక్టు పూర్తైన శుభ సందర్భంగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. మరో పక్క మంత్రి డోలా స్వయంగా నెత్తిన పొంగళ్లు పెట్టుకుని మహిళలతో భారీ ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సమర్పించారు.

# ఇంటింటికీ అభివృద్ధి ఫలాల పంపిణీ



అనంతపురము (చైతన్యరథం): రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో కనిపిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకులు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. నగరంలోని కమలా నగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కమలా నగర్ లోని డిసిఎంఎస్ కొట్టాలు నందు ప్రజలతో మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రెండేళ్లలో నగరం అభివృద్ధి చెందుతోందని ప్రజలు, కమలానగర్ లోని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. 250 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించమన్నారు. మరో 160 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అనంతపురం నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం 85 శాతం పూర్తయిందన్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేసినట్టు వివరించారు. మొదటి ఐదు సంతకాల్లో పింఛన్లు పెంచమన్నారు. గతంలో వెయ్యి రూపాయలు పెంచేందుకు జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పట్టిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క సంతకంతోనే పింఛన్లు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తల్లికి వందనం గతంలో ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ ఇస్తామని చెప్పి జగన్ రెడ్డి మోసం చేశారన్నారు. ఇప్పుడు రికార్డు స్థాయిలో తల్లికి వందనం కింద సాయం చేస్తున్నట్లు వివరించారు. విద్యాశాఖలో మంత్రి లోకేష్ అనేక మార్పులు తీసుకురావడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరుతున్నారన్నారు. కేవలం ఎన్టీఆర్, చంద్రబాబుకు మంచి పేరు వస్తుందని గతంలో అన్న క్యాంటీన్లను మూసి వేయించారన్నారు. తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని తిరిగి తెరిపించి కేవలం ఐదు రూపాయలకే మూడు పూటలా భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. రాయలసీమలో కూడా గతంలో ఎప్పుడు లేని విధంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందన్నారు. హార్టికల్చర్ హబ్ కోసం 40 వేల కోట్లు కేటాయించారని... పిపిపి మోడల్ లో మరో 60 వేల కోట్ల రూపాయలు తీసుకొస్తున్నారని చెప్పారు. ఒక అనంతపురం జిల్లాలోని లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమ తీసుకొచ్చారని గత ఐదేళ్లలో ఏ ఒక్క పరిశ్రమ కూడా అనంతపురం జిల్లాకు రాలేదని ఎమ్మెల్యే అన్నారు. పుట్టపర్తిలో 5వ జనరేషన్ కు చెందిన యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమలు కూడా వచ్చిందన్నారు. సిబిఎన్ బ్రాండ్‌తో మంత్రి నారా లోకేష్ కృషి వలన ఇన్ని పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదే రకంగా వారి కుమారులు ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న విగ్నేష్ రెడ్డి తర్లుపాడు, గొట్ల గట్టు, పొదిలి పట్టణములలో ఆయా మండలాల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తంగా మునుపెన్నడు లేని విధంగా ఈరోజు 145 మంది లబ్ధిదారులకు సుమారు 1 కోటి 24 లక్షల రూపాయల విలువైన సీఎం సహాయనిధి చెక్కు ఎల్ఓసి లను పంపిణీ చేశారు.

# ఇంటింటికీ సంక్షేమాభివృద్ధి ఫలాలు

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

దర్శి (చైతన్యరథం): తాళ్లూరు మండలం, శివరామ పురం గ్రామ పంచాయితీ పరిధిలోని 132/33 కెవి విధ్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్‌తోదర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ రెండేళ్ల కూటమిపాలనలో ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, ఇంటింటికి చేరాలన్న సంకల్పంతో ప్రతి తలుపు తడుతున్నామన్నారు. ప్రతి గడపకు వస్తున్నామని ప్రజల ఆనందాన్ని చూస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా మంత్రి గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి ఇతర పెద్దల సారధ్యంలో జన రంజక పాలనతో ప్రజల సమస్యలు తీర్చగలుగుతున్నామన్నారు. అందులో భాగంగానే నేడు తాళ్లూరులో 132/33 కేవీ విధ్యుత్ సబ్స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకున్నామని, కురిచేడు, ముండ్లమూరు మండలలో సబ్స్టేషన్ నిర్మిస్తున్నాం, దర్శిలో సబ్స్టేషన్ పూర్తిచేసుకున్నామన్నారు. ఇక లోవోల్టేజి సమస్య దర్శి నియోజకవర్గంలో ఉండదన్నారు. కలెక్టర్ సంపూర్ణ సహకారంతో కరువు లేని దొనకొండ గా సస్యశ్యామలంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. చెరువుల్లో పూడికలు తీసి భూగర్భ జలాలను పెంపొందించుకొని గుండ్లకమ్మ నది ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పారిశ్రామిక అభివృద్ధి, తాగునీటి కష్టాలు తీర్చుకునేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. తాళ్లూరు మండలంలో 10 కోట్లతో మొగిలి గుండం వాయువు రిజర్వాయర్ను పూర్తి చేసుకోగలిగామన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం జెండాను ఎగరవేయాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు.




# ప్రజలందరికీ వెంకయ్య స్వామి ఆశీస్సులు

## గొలగమూడిలో అంగరంగ వైభవంగా 44వ ఆరాధనోత్సవాలు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు



వెంకటాచలం (చైతన్యరథం): గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో 44వ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జ్యోతమ్మ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమానికి చేరుకున్న సోమిరెడ్డి దంపతులకు ఈఓ బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు, గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించి ఆశీస్సులు పొందడం తమ అదృష్టమన్నారు. టీటీడీలో జేఈఓగా పనిచేసిన అనుభవంతో ఈఓ బాలసుబ్రహ్మణ్యం ఆశ్రమ అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఒక్క రూపాయి కూడా జీతం తీసుకోకుండా సేవ చేయడం అభినందనీయమన్నారు. ఆశ్రమంలో ఆస్తులతో పాటు భక్తులకు అందుతున్న వసతులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఏడాదికి సుమారు 12 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతి కల్పించడం, ప్రజలకు కళ్యాణ మండపం అందుబాటులోకి తీసుకురావడం, ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించడం ఆశ్రమ సేవా కార్యక్రమాల్లో మరో విశేషమని పేర్కొన్నారు. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని సోమిరెడ్డి ఆకాంక్షించారు.

# సమష్టిగా నీటి ఎద్దడిని ఎదుర్కోవాలి

## అధికారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపు



కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలోని ఆర్అండ్‌బీ వసతి గృహంలో వివిధ శాఖల అధికారులతో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యు ఎస్ఎస్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. టిడ్కో అధికారులతో సమీక్ష నిర్వహించి, గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గతంలో డీడీలు చెల్లించిన నిజమైన పేద లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని, గతంలో జరిగిన అవకతవకలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే టిడ్కో లేఅవుట్‌కు తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా సమర్థవంతంగా వినియోగిస్తూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. హంద్రీనీవా సుజల స్రవంతి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కృష్ణా జలాలను మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా విడుదల చేసి చెరువులను నింపే చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు.

## టీడీపీలోకి భారీ 25 కుటుంబాలు చేరికలు

### నీలకంఠాపురంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ!

మడకశిర (చైతన్యరథం): నీలకంఠాపురం గ్రామంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు అధికారికంగా తెలుగుదేశం పార్టీలో చేరాయి. టీడీపీ విధివిధానాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా నూతనంగా పార్టీలోకి వచ్చిన కుటుంబాల సభ్యులు తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్క కుటుంబానికి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



సాదరంగా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

నెల్లూరు (చైతన్యరథం): ప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్యాన్ని దరిచేరుస్తూ 44వ డివిజన్‌లో బృహత్తర వైద్య శిబిరం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది.. కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని మహబూబ్ ఖాన్ పార్కు వద్ద మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నారాయణ నేత్రజ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.నారాయణ ఆసుపత్రి కంటి విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ సుధ, స్థానిక నాయకురాలు పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలను అందించారు.

ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి పాల్గొన్నారు. నెల్లూరు నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు కప్పిర రేవతి, డాక్టర్ సుధ తెలిపారు. 44వ డివిజన్‌లో ఈ తరహా శిబిరాన్ని నిర్వహించడం ఇది మూడోసారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్యం అందుతుందన్నారు. దీనికి తోడు నారాయణ మాతృసేవ పథకం ద్వారా గర్భిణులకు ఉచిత సురక్షిత ప్రసవాలు అందించి చీర-సారెలతో కూడిన ప్రత్యేక కిట్లను కూడా అందజేస్తున్నట్లు వరించారు...ఇప్పటివరకు ఈ పథకాల ద్వారా 11,900మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 7,000 మందికి పైగా నాణ్యమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు, గ్లాకోమా, డయాబెటిక్ రెటినోపతి తీవ్రమైన దంత సమస్యలు ఉన్నవారిని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేసి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

# స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పని చేయండి

## అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

రాప్తాడు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచన మేరకు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పని చేయాలని అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, రెవెన్యూ, విద్యా, విద్యుత్, వ్యవసాయశాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అందరికీ గృహాలు, ఇంటింటికి కొళాయి, పీఎంఏవై జే కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, సూక్ష్మ సాగునీటి విస్తీర్ణం, ఉద్యాన పంటల విస్తీర్ణం, పాడి పరిశ్రమ అభివృద్ధి వంటి అంశాల గురించి చర్చించారు. ఇందులో ఆయా కార్యక్రమాల పురోగతి ఎలా ఉంది.. భవిష్యత్ లో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై శిక్షణ ఇచ్చారు. మరోవైపు పీజిఆర్ఎస్ కార్యక్రమంపై ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇప్పటి వరకు నమోదైన ఫిర్యాదులు, వాటిలో గడువులోపు పరిష్కరించినవి, ఇంకా పరిష్కరించాల్సిన, పెండింగ్ లో ఉన్నఫిర్యాదుల గురించి చర్చించారు. అయితే మనకు వస్తున్న ఫిర్యాదులన్నీ ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వాస్తవంగా ప్రతి సోమవారం, లేదా మేము శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ లలో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. అత్యధిక ఫిర్యాదులు రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫించన్ల కోసం వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇంకా ఎక్కువ స్థాయిలో ఫిర్యాదులు ఉంటున్నాయన్నారు. ఈ గణాంకాలను కేవలం ఫిర్యాదుల సంఖ్యగా చూడొద్దన్నారు. ఇవి కొందరి భవిష్యత్ కు



సంబంధించినవి కూడా ఉంటాయన్నారు. పీజిఆర్ఎస్ డేటాను ఉపయోగించి, పదే పదే వస్తున్న ఒకే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. పాఠశాలల్లో భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా వైద్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాలు తదితర శాఖల్లో ప్రజలకు అందాల్సిన సేవల గురించి పర్యవేక్షించాలన్నారు. మన లక్ష్యం ప్రజలకు మెరుగైన పాలన, వేగవంతమైన సేవలు, సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమేనని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.



# సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ప్రజాదర్బార్‌లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల (చైతన్యరథం): నంద్యాల పట్టణం బొమ్మలసత్రం లోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజా ధర్బార్ నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోనీ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తమ సమస్యలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి విన్నవించుకునేందుకు అధిక సంఖ్యలో నంద్యాల ఎంపీ ఆఫీస్ కు తరలిరావడంతో ఆఫీస్ అర్జీదారులతో కిటకిటలాడింది. ఎక్కువ రెవిన్యూ భూముల సమస్యలు వినతి పత్రం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఇవ్వగా ఆయా మండల తహసీల్దార్లకు పంపి త్వరగా పరిష్కరించాలని కోరారు. వివిధ శాఖల వినతులు కూడా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వారికి పంపారు. కొన్ని వినతులు ఫోన్ ద్వారా ఆయా శాఖల అధికారులకు వివరించి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు కూడా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతి పత్రం ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మీ సమస్య నా సమస్య గా భావించి మీ వినతి పత్రాలకు ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కారం చూపుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అర్జీదారులకు భరోసా ఇచ్చారు.



# రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్

## మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శించిన పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. మండలంలోని రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఈనెల19న కానిస్టేబుల్ చిరుతల మల్లికార్జున (37) ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. ప్రమాదానికి గురై మరణించారు. రాప్తాడు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే సునీత మల్లికార్జున ఇంటికి వెళ్లారు. అతని భార్య, కుమారుడు, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. విధి నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధిగా ఉండే మల్లికార్జున ఇలా చిన్న వయసులోనే మరణించడం చాలా బాధాకరమన్నారు. అధైర్యపడద్దని.. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# చేనేత చీరకట్టులో మురిసి... మెరిసి

## లండన్‌లో భారతీయ సంస్కృతిని చాటిచెప్పిన తెలుగు మహిళలు





**లండన్:** యూకేలోని లండన్‌లో భారత జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళలు సంప్రదాయ చేనేత చీరలు ధరించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చేనేత కళ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. 'తెలుగు లేడీస్ ఇన్ యూకే' ఫేస్‌బుక్ గ్రూప్ అడ్మిన్ శ్రీదేవి మేనవల్లి ఈ వేడుకను సమన్వయం చేశారు. సెంట్రల్ లండన్, బర్మింగ్‌హామ్, మాంచెస్టర్, కోవెంట్రీ, రగ్బీ, మిల్టన్ కీన్స్, అమర్షమ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు విదేశీ గడ్డపై తమ ఐక్యతను చాటారు. ఉప్పాడ, పైఠాణీ, అజ్రఖ్, మంగళగిరి, కాంచీపురం, కోటా కాటన్ వంటి విభిన్న రకాల చేనేత చీరలను ధరించి భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అద్భుతమైన చేనేత కళను ప్రదర్శించారు. చేనేత చీరను ధరించడం వెనక కేవలం అందం మాత్రమే కాదు... చేనేత కార్మికుడి శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకత ఉంటాయని పలువురు మహిళలు తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ వృత్తులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్థానికంగా తయారయ్యే చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నేత కార్మికులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు.



# 'నాట్స్' ఆధ్వర్యంలో చెస్ పోటీలు

## కొలరాడోలో సత్తా చాటిన తెలుగు పిల్లలు





**కొలరాడో (అమెరికా):** అమెరికాలో తెలుగు వారి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్)... తాజాగా కొలరాడోలో 'కొలరాడో చాప్టర్ ఆధ్వర్యంలో 'నాట్స్ కొలరాడో చెస్ కాంపిటీషన్-2026' పేరిట లోన్‌ట్రీ సివిక్ సెంటర్లో నిర్వహించిన పోటీలకు మంచి స్పందన లభించింది. తెలుగు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తి చాటారు. గ్రేడ్ K3 విభాగంలో దిత్వి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా హంషిక ద్వితీయ, స్ప్రింక తృతీయ స్థానంలో నిలిచారు. ఇక గ్రేడ్ 4-7 విభాగంలో మిత్ర.ఎస్ విజేతగా నిలవగా పవన్ శ్రీతేజ ద్వితీయ స్థానాన్ని, శ్రియాన్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అత్యంత ఉత్కంఠగా సాగిన గ్రేడ్ 8-12 విభాగంలో నాగ శైలేష్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఛాంపియన్‌గా నిలిచాడు. ఆశ్రిత్ ద్వితీయ, అర్జున్ తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. సాంస్కృతిక పరిరక్షణ, యువత సాధికారతే లక్ష్యంగా ఏర్పడిన నాట్స్ కొలరాడో చాప్టర్.. ఈ కార్యక్రమంతో స్థానిక తెలుగు వారిని ఒకే వేదికపైకి తెచ్చింది. పిల్లల్లో విమర్శనాత్మక ఆలోచనను, క్లిష్ట సమయాల్లో నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను చెస్ పెంపొందిస్తుందని నాట్స్ నాయకులు పేర్కొన్నారు. లోన్ ట్రీలో తెలుగు పిల్లల ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు.

అనుదీప్ ఆర్ల నాట్స్ వైస్-ప్రెసిడెంట్ (ఫైనాన్స్/మార్కెటింగ్), కొలరాడో చాప్టర్ కో-ఆర్డినేటర్స్ మంజుల కుంటముక్కల, ప్రత్యూష అప్పరసు, జనసుధ (స్పోర్ట్ చైర్), సత్యజీ చిగురుపాటి (కోశాధికారి), సాయిచరణ్ (సోషల్ మీడియా), జ్యోత్స్న గుంటూరు, దివ్య చంద్రిక, సాయి కృష్ణ సహకారంతో పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. విజయవంతం కావడానికి సహకరించిన నాట్స్ వాలంటీర్లకు, నాట్స్ నాయకులకు, పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు నాట్స్ కొలరాడో చాప్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరినీ నాట్స్ చైర్మన్ కిశోర్ కంచర్ల, నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ అభినందించారు.





# డాక్టర్ ఈష్ సింఘాల్ సేవలు ప్రశంసనీయం

## భారత రాయబార కార్యాలయం ప్రథమ కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు

## ఆయన అందించిన సేవలను కొనియాడిన ఐసీబీఎఫ్, భారత సమాజ ప్రతినిధులు

**దోహా:** ఖతార్‌లోని భారతీయ సమాజానికి విశేష సేవలు అందించిన భారత రాయబార కార్యాలయం ప్రథమ కార్యదర్శి, ఐసీబీఎఫ్ సమన్వయ అధికారిగా పనిచేసిన డాక్టర్ ఈష్ సింఘాల్ తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. భారత్ తిరిగి వెళ్తున్న సందర్భంగా ఇండియన్ కమ్యూనిటీ బెనెవలెంట్ ఫోరం (ఐసీబీఎఫ్) ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. దోహాలో జరిగిన కార్యక్రమంలో ఐసీబీఎఫ్ అధ్యక్షుడు షనావాస్ బావా తన అధ్యక్ష ప్రసంగంలో డాక్టర్ ఈష్ సింఘాల్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన అందుబాటులో ఉండే స్వభావాన్ని, వినయాన్ని, ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో భారతీయ సమాజానికి సహాయం చేయడానికి చూపిన చొరవను ప్రశంసించారు.

భారత రాయబార కార్యాలయంలో ప్రథమ కార్యదర్శి, విద్య, సాంస్కృతిక విభాగం అధిపతి హరీష్ పాండే మాట్లాడుతూ... డాక్టర్ ఈష్ సింఘాల్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేశారు. భారత్‌లోని వివిధ సంస్థల్లో ఆయన అందించిన సేవలు, సాధించిన విజయాలను వివరించారు. భారత రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్, చార్జ్ డి అఫైర్స్ సందీప్ కుమార్... ఖతార్‌లో 27 నెలల పాటు డాక్టర్ ఈష్ సింఘాల్ అందించిన సేవలను ప్రశంసించారు. ఇటీవల జరిగిన ప్రాంతీయ సంక్షోభం, రాస్ లఫాన్ ప్రమాదం వంటి సందర్భాల్లో కమ్యూనిటీ సభ్యులను స్వయంగా సంప్రదించి, అవసరమైన వారికి సహాయం అందించేందుకు చేసిన కృషిని ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఐసీబీఎఫ్ అనుబంధ సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఈష్ సింఘాల్‌ను పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సత్కరించి ఆయన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐసీసీ అధ్యక్షుడు ఏపీ మణికందన్, ఐఎస్‌సీ అధ్యక్షుడు ఈపీ అబ్దుల్ రహ్మాన్, ఐబీపీసీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, ఐసీబీఎఫ్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్ కేఎస్ ప్రసాద్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కేవీ బోబన్ తదితరులు డాక్టర్ ఈష్ సింఘాల్‌ను అభినందిస్తూ ప్రసంగించారు.

ఆతిథ్యం వహించిన ఐసీబీఎఫ్ జనరల్ సెక్రటరీ దీపక్ శెట్టి... డాక్టర్ సింఘాల్ మానవతా దృక్పథాన్ని, భారతీయ సమాజంలో ఆయన సంపాదించుకున్న ఆదరణను గుర్తు చేశారు. ఈష్ వృత్తిపరమైన ప్రతిభకు గుర్తింపుగా భారత రాష్ట్రపతి, కేంద్ర హోం మంత్రి, లోక్‌సభ స్పీకర్ నుంచి అందుకున్న పలు గౌరవాలను ప్రస్తావించారు. భారత రాయబార కార్యాలయ లేబర్ విభాగం అధిపతి రవి రాఠీ అతిథిగా హాజరయ్యారు. ఐసీబీఎఫ్ మాజీ అధ్యక్షుడు పీఎన్ బాబురాజన్, అబ్దుల్ ఖాదర్, అపెక్స్ బాడీ ప్రతినిధులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు, అనుబంధ సంస్థల నాయకులు, భారతీయ కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆహుతులకు ఐసీబీఎఫ్ కార్యదర్శి జాఫర్ తయ్యిల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ఐసీబీఎఫ్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మణి భారతి, ఇర్ఫాన్ అన్సారీ, నీలాంబరి సుశాంత్, అమర్ వీర్ సింగ్, ఖాజా నిజాముద్దీన్, శంకర్ గౌడ్, అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు జావేద్ అహ్మద్, నాజియా జియావుద్దీన్ సమన్వయం చేశారు.




### కతార్‌లో సేవా కాలాన్ని ఎంతో ఆనందంగా గడిపాను

తన వీడ్కోలు ప్రసంగంలో డాక్టర్ ఈష్ సింఘాల్ తనకు సహకారం అందించిన ఐసీబీఎఫ్, ఇతర అపెక్స్ బాడీలు, అనుబంధ సంస్థలు, భారతీయ సమాజానికి కృతజ్ఞతలు తెలిపారు. కతార్‌లో సేవా కాలాన్ని ఎంతో ఆనందంగా గడిపానని, భారతీయ సమాజానికి సహాయం చేయడానికి తన శక్తి మేరకు ప్రయత్నించానని పేర్కొన్నారు. తన పదవీ కాలంలో సహకరించిన భారత రాయబార కార్యాలయం సహచరులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మరో ర్యాలీకి సిద్ధమైన కేజేపీ




నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా సంసద్ ఛలో కార్యక్రమంతో యావత్ దేశంలో సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ దేశరాజధానిలో మరో ర్యాలీకి సిద్ధమైంది. సెప్టెంబర్ 5 ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ పేర్కొన్నారు. జెన్ జీని కేంద్రం మోసగించడాన్ని తాము సహించబోమని చెప్పారు. యువతను, మృతుల కుటుంబాలను కేంద్రం మోసగించిందని ఆరోపించారు. కేంద్రం జెన్ జీకి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవచ్చని తమకు దీక్ష విరమణ రోజునే అనిపించిందని సౌరవ్ దాస్ తెలిపారు. 'జులై 25 దీక్ష విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోకపోవచ్చని నేషనల్ వర్కింగ్ కమిటీ అప్పుడే సందేహాలు వ్యక్తం చేసింది. అందుకే మరో ర్యాలీకి సిద్ధమయ్యాము. ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలు, పోలీసు దౌర్జన్యానికి బాధితులుగా మిగిలిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు' అని సౌరవ్ దాస్ తెలిపారు. అంతకుముందు సీజేపీ నేషనల్ వర్కింగ్ కమిటీ సమావేశమైన కేంద్రం జెన్ జీని మోసగించినట్టు తేల్చింది. ఎఫ్ఐఆర్‌ల తొలగింపు, ఆత్మహత్య చేసుకున్న బాధితులకు పరిహారం విషయంలో కేంద్రం తన మాట నిలబెట్టుకోలేదని తేల్చింది. ఈ నేపథ్యంలో మరో శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు నిర్ణయించింది.

## యూపీలో పోలీసులకు, గో స్మగ్లర్లకు మధ్య కాల్పులు

ఉత్తర్‌ప్రదేశ్‌లో పోలీసులకు, గో స్మగ్లర్లకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు స్మగ్లర్లకు తీవ్ర గాయాలయ్యాయి. నిన్న ఆదివారం యూపీలోని మీరట్‌లో కొందరు గోవులను అక్రమంగా తరలించి, గోవధకు పాల్పడుతున్నారని పోలీసులకు సమాచారమందింది. దీంతో పోలీసులు గోవధ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లగా అక్కడ ఓ గోవు చెట్టుకు కట్టేసి ఉంది. పోలీసులు రావడాన్ని గమనించిన తస్లీమ్, భూరా అనే స్మగ్లర్లు వెంటనే కాల్పులు జరపడం మొదలుపెట్టారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు స్మగ్లర్లూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాగా మరో స్మగ్లర్ మాత్రం పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటిదాకా తస్లీమ్‌పై 15 కేసులు, భూరాపై 10 కేసులు ఉన్నాయని తెలుస్తోంది.




# ఎయిర్ ఇండియా విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

న్యూఢిల్లీ నుంచి పాట్నా బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. పాట్నాలోని జయప్రకాశ్ నారాయణ్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న విమానాన్ని పక్షి ఢీ కొట్టింది. ఈ అంశాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి పైలట్ తీసుకెళ్లారు. దీంతో ఎయిర్ పోర్ట్‌లో ఫైర్, అత్యవసర సేవలను అధికారులు మోహరించారు. ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన ఈ విమానానికి సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రన్ వేపై దిగుతున్నప్పుడు విమానం కుడి వైపు ఇంజిన్‌ను పక్షి ఢీకొట్టినట్లు పరిశీలనలో తెలిందన్నారు. కానీ విమానం ఇంజిన్‌కు ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈ సమయంలో విమానంలో 160 మంది ప్రయాణికులు ఉన్నారని వివరించారు. భద్రతా తనిఖీల అనంతరం ఈ విమానం ఢిల్లీకి దాదాపు గంటన్నర ఆలస్యంగా బయలుదేరిందని ఎయిర్ పోర్ట్ అధికారులు వివరించారు. మరో వైపు ఈ వారంలో పాట్నా ఎయిర్ పోర్ట్‌లో విమానాన్ని పక్షి ఢీకొట్టిన ఘటనల్లో ఇది రెండోదని తెలిపారు.

# కేరళ కుట్టి.. మిస్ యూనివర్స్ పట్టీ!

### జైపూర్ గ్రాండ్ ఫినాలేలో విజేతగా నిలిచిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో





కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. దీంతో నవంబర్‌లో పోర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె బరిలోకి దిగనున్నారు.

**కేరళ నుంచి జాతీయ స్థాయికి..**

కాజియా స్వస్థలం కేరళ అయినప్పటికీ ఆమె బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో ఆమె విద్యాభ్యాసం సాగింది. పేజెంట్రీతో పాటు కాజియాకు కళలపై కూడా ఆసక్తి ఉంది. 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గాయని, సంగీత కళాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. పబ్లిక్ స్పీకింగ్, నటనలోనూ అనుభవం ఉంది. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా కూడా అరంగేట్రం చేశారు. కేరళకు చెందిన కాజియా ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్‌ను గెలుచుకున్నారు. అనంతరం 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరిగిన మిస్ యూనివర్స్ కేరళ 2026 పోటీల్లో విజేతగా నిలిచి.. ఆ టైటిల్‌ను గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏకంగా మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని దక్కించుకోవడం విశేషం.

**జైపూర్‌లో హోరాహోరీ పోటీ..**

మిస్ యూనివర్స్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులు పోటీ పడగా.. కజియా లిజ్ మేజో విజేతగా నిలిచారు. తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా అనుశ్రీకి మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ కూడా దక్కింది. ఈ ఫినాలేకు మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో పాటు మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు జడ్జీలుగా వ్యవహరించారు.

# రీ కౌంటింగ్ కోరిన స్టాలిన్

### హైకోర్టులో పిటిషన్ దాఖలు



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తాజాగా మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి ఓటమి చవి చూసిన ఆయన ఓటింగ్ మెషీన్లు, వీవీప్యాట్ ప్రక్రియలకు సంబంధించి లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. రీకౌంటింగ్‌కు ఆదేశించాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. ఈ నియోజకవర్గంలో విజయం సాధించిన టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు ఎన్నికను రద్దు చేయాలని కోరారు. తనను విజేతగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తనకు కంచుకోటగా ఉన్న కొళత్తూర్‌లో స్టాలిన్ అంతకుముందు వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ 2026లో మాత్రం అనూహ్యంగా ఓటమి చవిచూశారు. టీవీకే అభ్యర్థి, సీనియర్ నేత వీఎస్ బాబు 8,795 ఓట్ల తేడాతో స్టాలిన్‌పై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో బాబుకు 82,997 ఓట్లు పోలవగా, స్టాలిన్‌కు 74,202 ఓట్లు వచ్చాయి. అయితే, డీఎంకే సారథ్యంలోని కూటమికి తమిళ ప్రజల నుంచి మద్దతు దక్కిందని ఫలితాల విడుదల అనంతరం స్టాలిన్ పేర్కొన్నారు. అధికార పార్టీకి, డీఎంకే కూటమికి మధ్య కేవలం 3.52 శాతం ఓట్ల అంతరమే ఉందని చెప్పారు. అయితే, ప్రజలు మార్పు కోరుకోవడంతోనే తాను విజయం సాధించానని బాబు తెలిపారు. స్థానికులెవరూ స్టాలిన్‌కు తెలియదని అన్నారు. ఆయన సీఎం అయినా ఎమ్మెల్యే అయినా ముందుగా నియోజకవర్గ ప్రజలతో మమేకం కావాలని సూచించారు.





# ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణం

### కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు. ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్యశాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని, ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం హత్య

*అదే ఇంట్లో స్నానం, భోజనం చేసిన నిందితులు*





బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లోని రంగ్‌పూర్‌లో హిందూ కుటుంబం దారుణ హత్యకు గురైన ఘటనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కుటుంబంలోని నలుగురిని హత్య చేసిన తర్వాత కూడా నిందితులు వెంటనే అక్కడి నుంచి పారిపోలేదు. కొన్ని గంటల పాటు అదే ఇంట్లో ఉండి స్నానం చేసి, ఫ్రిజ్‌లో ఉన్న దోసకాయలు, ఖర్జూరాలు తిన్నారు. అనంతరం అక్కడే మాదకద్రవ్యాలను సేవించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతులను రంగ్‌పూర్ జిల్లా పాఠశాల మాజీ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తి (65), ఆయన భార్య ప్రీతిలత (50), కుమార్తె ఆగామి (23), కుమారుడు ప్రియమ్ (12)గా గుర్తించారు. రంగ్‌పూర్ నగరంలోని దాస్‌పారా ప్రాంతంలోని వారి ఇంట్లో శనివారం రాత్రి సుమారు 11.30 గంటలకు మృతదేహాలను గుర్తించారు. సిద్ధార్థ దాస్, ముగ్ధ దాస్ అనే ఇద్దరు వ్యక్తులు పక్క భవనం మీదుగా గణపతి ఇంటి పైకప్పు పైకి వెళ్లారు. అక్కడ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. పైకప్పుపై శబ్దాలు విని గణపతి అక్కడికి వెళ్లి వారిని ప్రశ్నించడంతో గొడవ జరిగింది. తమను గుర్తిస్తారనే భయంతో నిందితులు గణపతి గొంతును తువ్వాలతో బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. గణపతి అరుపులు విని ఆయన భార్య ప్రీతిలత పైకి వెళ్లగా, ఆమెను కూడా మెట్ల వద్ద గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కుమార్తె ఆగామి, 12 ఏళ్ల కుమారుడు ప్రియమ్‌ను కూడా హత్య చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. గణపతి మృతదేహం పైకప్పుపై, ప్రీతిలత, ఆగామి మృతదేహాలు మెట్ల వద్ద, ప్రియమ్ మృతదేహం ఇంట్లోని మంచం కింద లభించాయి . కుటుంబాన్ని హత్య చేసిన తర్వాత నిందితులు వెంటనే పారిపోకుండా అదే ఇంట్లో కొన్ని గంటలు గడిపినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లోనే స్నానం చేసి, ఫ్రిజ్‌లో ఉన్నవాటిని తిన్నారు. అనంతరం తమ వద్ద ఉన్న డ్రగ్స్ సేవించారని దర్యాప్తులో తేలింది. శుక్రవారం ప్రార్థనల సమయంలో రోడ్లపై రద్దీ తక్కువగా ఉన్న సమయంలో వారు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. హత్యలను దోపిడీ ఘటనగా చూపించేందుకు నిందితులు ప్రయత్నించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఉబెర్‌పై రూ.9,224 కోట్ల జరిమానా




డచ్: కింది స్థాయి ఉద్యోగి తప్పు చేస్తే పైఅధికారులు మొదట మందలిస్తారు. పద్ధతిని మార్చుకోమని హెచ్చరిస్తారు. అప్పటికీ తీరు మార్చుకోకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తారు. ఉద్యోగుల జీవితాలను తలకిందులు చేసే ఈ వ్యవహారాల్లో కంపెనీలు సాధారణంగా ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. పట్టువిడుపుల ధోరణితో నిర్ణయాలు తీసుకుంటాయి. కానీ భావోద్వేగాలే లేని ఏఐకి ఈ నిర్ణయాధికారాలను కట్టబెట్టిందన్న ఆరోపణతో డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఉబెర్‌పై ఏకంగా 825 మిలియన్ యూరోల (రూ.9224 కోట్లు) జరిమానా విధించింది. యూరప్‌లో కొందరు ఉబెర్ డ్రైవర్‌ల సస్పెన్షన్, తొలగింపులు మనుషుల పర్యవేక్షణ లేకుండానే ఏఐ నిర్ణయాల మేరకు జరిగాయని డచ్ ప్రభుత్వం ఆరోపించింది. డ్రైవర్‌లకు ముందస్తు సమాచారం కూడా అందలేదని పేర్కొంది. కంప్యూటర్‌లు తీసుకున్న నిర్ణయాల కారణంగా కొందరు డ్రైవర్‌ల అకౌంట్స్ శాశ్వతంగా రద్దైపోయాయని చెప్పింది. 'మనుషుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపించే ఈ నిర్ణయాలను మానవుల పర్యవేక్షణ లేకుండా కంప్యూటర్లు స్వతంత్రగా తీసుకోకూడదు' అని డచ్ డేటా రెగ్యులేటరీ సంస్థ డిప్యూటీ ఛైర్‌పర్సన్ మానిక్ వెర్డియర్ వ్యాఖ్యానించారు. ఉబెర్ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. కేవలం ఆటోమేటెడ్ కంప్యూటర్ వ్యవస్థల ఆధారంగా తాము ఏ డ్రైవర్ అకౌంట్‌ను శాశ్వతంగా రద్దు చేయలేదని స్పష్టం చేసింది. డ్రైవర్‌లపై సస్పెన్షన్స్ అన్నీ తాత్కాలికమైనవేనని పేర్కొంది. డ్రైవర్‌లను శాశ్వతంగా తొలగించే నిర్ణయాలపై మనుషుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉంటుందని పేర్కొంది. ఈ నిర్ణయాలను సవాలు చేసే స్వేచ్ఛ డ్రైవర్‌లకు ఇచ్చామని కూడా తెలిపింది. ఈ జరిమానా విధింపుపై అప్పీలు చేసుకునేందుకు కూడా సిద్ధం అవుతోంది. ఇప్పటికే అనేక అమెరికన్ కంపెనీలపై ఐరోపా దేశాలు వివిధ కారణాలతో జరిమానాలు విధించాయి. ఈ జాబితాలోకి తాజాగా ఉబెర్ కూడా వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో ఐరోపా సమాఖ్య తీరుపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తమ దేశ కంపెనీలను మాత్రమే కావాలని టార్గెట్ చేస్తున్నారంటూ ఇప్పటికే పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఉబెర్ ఉదంతం నేపథ్యంలో మనుషుల జీవితాలపై ఏఐ నియంత్రణ భవిష్యత్తులో ఎంతటి స్థాయికి చేరుకుంటుందో అన్న చర్చ మొదలైంది.

### గినియాలో కుప్పకూలిన డంపింగ్ యార్డ్

# 30 మంది దుర్మరణం

ఆఫ్రికా: పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటి వరకు 18 మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడిం చారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమా నంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకా శమున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.




# ఓపీటీకి లక్ష డాలర్ల ఫీజు!

*అమెరికా: భారతీయులకు మరో షాకిచ్చేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. హెచ్-1బీ వీసా, ఓపీటీ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజు విధించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలు రెడీ అయినట్టు అంత ర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించి పాలనాపరమైన అనుమతుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ఇప్పటికే ప్రయత్నా లు ప్రారంభించినట్టు ఇమిగ్రేషన్ న్యాయసేవల సంస్థ ఫ్రాగోమన్ తెలిపింది. అయితే, నూతన చార్జీలు ఏ స్థాయిలో ఉండబోతు న్నాయి? అనే అంశం ఇంకా స్పష్టత రాలేదు. ఈ ప్రతిపాదనలపై అమెరికా గోప్యంగా వ్యవహరిస్తోంది. ఫ్రాగోమన్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, ఓపీటీ ఫీజుకు సంబంధించిన ప్రతిపాదనను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎమ్‌బీ) సమీక్ష కోసం ఆగస్టు 20న పంపించినట్టు తెలుస్తోంది. కొన్ని రకాల హెచ్-1బీ వీసా పిటిషన్ల ఫీజును పెంచే ప్రతిపాదనపై ఓఎమ్‌బీ ఇప్పటికే సమీక్ష పూర్తిచేసి, ఆగస్టు 19న గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఓపీటీ ఫీజు లక్ష డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉందని మీడియా కథనాలను ఉటంకిస్తూ ఫ్రాగోమన్ పేర్కొంది. అయితే, ఈ విషయం పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదని కూడా చెప్పింది. ఎంత ఫీజును నిర్ణయించాలనే విషయంలో డీహెచ్‌ఎస్ పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని తెలిపింది. కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తుల ఫీజులను లక్ష డాలర్లను పెంచేందుకు ట్రంప్ సర్కారు గతంలో చేసిన ప్రయత్నాన్ని ఫెడరల్ కోర్టు అడ్డుకుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం కొత్త మార్గాల్లో ఫీజులను పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.*




### ఒక్క చుక్క చమురునూ రానివ్వం

# అమెరికాకు ఇరాన్ వార్నింగ్



ఇరాన్: అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటా మని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

### గాల్లోనే ఇంజిన్ ఫెయిల్..

# సముద్రంలో విమానం దించిన యువ పైలట్

అమెరికా: అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ యువ పైలట్ ప్రదర్శించిన సాహసం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంజన్‌లో సమస్య కారణంగా నేలపై కూలిపోతున్న చిన్న విమానాన్ని ఆమె ఎంతో చాకచక్యంగా సముద్రంలోకి మళ్లించి.. తనతో పాటు అనేక మంది ప్రాణాలను కాపాడారు. 'న్యూయార్క్ పోస్ట్' కథనం ప్రకారం.. 23 ఏళ్ల ఫెయిత్ టెన్‌క్లే అనే మహిళా పైలట్ తన కుటుంబానికి చెందిన సింగిల్ ఇంజిన్ 'పైపర్ పీఏ30' విమానంలో ఫోర్ట్ మేయర్స్ నుంచి బహామాస్‌లోని తన తల్లిదండ్రులను పికప్ చేసుకోవడానికి బయలుదేరారు. ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా విమానంలో ఇంజిన్ సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన ఆమె ఫ్లోరిడాలోని రద్దీగా ఉండే బోకా రాటన్ బీచ్ సమీపంలో అత్యవసర ల్యాండింగ్‌కు సిద్ధమయ్యారు. భవనాలను, బీచ్‌లో ఉన్న పర్యాటకులను తప్పిస్తూ చాకచక్యంగా విమానాన్ని అట్లాంటిక్ మహాసముద్రంలోకి దించారు. విమానంలో సముద్రంలోకి పడిపోవడం చూసి బీచ్‌లో ఉన్న సందర్శకులు షాక్ గురయ్యారు. ఆ తర్వాత ఆ యువ పైలట్ సురక్షితంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమానం సముద్రంపై ల్యాండైన వెంటనే ఫైయిత్ ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరారు. క్షణాల వ్యవధిలో స్థానికులు, అత్యవసర సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెకు సహాయం అందించారు. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో సదరు యువతికి ఎలాంటి గాయాలూ కాలేదని వైద్యులు నిర్ధారించారు. జనసమూహం ఉన్న బీచ్ ప్రాంతాన్ని తప్పించి... విమానాన్ని సముద్రం వైపు మళ్లించిన ఫెయిత్ సమయస్ఫూర్తిపై అందరూ ప్రశంసల వర్షం కురిపించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది.



## ధ్రువ్ జురెల్ సెంచరీ

# శ్రీలంకతో రెండో టెస్టులో భారత్ భారీ స్కోర్




కొలంబో: కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోర్ చేసింది. 503/9 స్కోర్ వద్ద టీమిండియా డిక్లేర్ చేసింది. డిక్లేర్ ఇచ్చిన సమయానికి క్రీజులో ధ్రువ్ జురెల్(115), ప్రసిద్ధ్ కృష్ణ(4) ఉన్నారు. ఈ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు చెలరేగి ఆడారు. లంక బౌలర్లకు చుక్కలు చూపించారు. ఈ ఇన్నింగ్స్‌లో రెండు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు నమోదయ్యాయి.

తొలి టెస్టులో శతక్కొట్టిన దేవదత్ పడిక్కల్(117) రెండో టెస్టులోనూ సెంచరీ బాదాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్(115) శతకం బాదడం విశేషం. అయితే ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి సెంచరీ చేసిన రెండో భారత ప్లేయర్‌గా ధ్రువ్ రికార్డు నెలకొల్పా డు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(50), వికెట్ కీపర్ రిషభ్ పంత్(63) హాఫ్ సెంచరీలతో రాణించారు. పంత్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన సంగతి తెలిసిందే. కోలుకుని తిరిగి మైదానంలోకి దిగిన పంత్.. హాఫ్ సెంచరీ చేయడం విశేషం. యశస్వి జైస్వాల్(45), రవీంద్ర జడేజా(43) పర్వాలేదనిపించా రు. కేఎల్ రాహుల్(18), సారాంశ్ జైన్(6), మానవ్ సుతార్(18), సిరాజ్(3) పరుగులు చేశారు. కాగా శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 2, కేషార నువాంత 2, లాహిరు కుమార ఒక వికెట్ పడగొట్టారు.

**రిషబ్ పంత్ అరుదైన ఘనత**

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో హాఫ్ సెంచరీతో రాణించిన భారత ఆటగాడు, వికెట్ కీపర్ రిషభ్ పంత్ అరుదైన ఘనత సాధించాడు. ఈ క్రమంలోనే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని అధిగమించాడు. విదేశీ గడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు నమోదు చేశాడు. ధోని 2,496 పరుగులు చేయగా.. పంత్ 2500 పరుగుల మైలు రాయిని దాటేశాడు. ఈ మ్యాచ్‌లో రిషబ్ పంత్ 81 బంతుల్లో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. కెరీర్‌లో ఇది అతడికి 21వది. మరో ప్లేయర్ ధ్రువ్ జురెల్ కూడా అర్ధ శతకం చేశాడు. 99 బంతుల్లో తన మూడో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం కూడా సెంచరీ దాటేసింది. లంచ్ విరామ సమయానికి భారత్ స్కోరు 112 ఓవర్లకు 419/6. క్రీజ్‌లో పంత్ (63బి), ధ్రువ్ జురెల్ (59) ఉన్నారు.

**విదేశీగడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్లు**

రిషబ్ పంత్-2501
ఎంఎస్ ధోని-2496
ఫరోఖ్ ఇంజనీర్-1209
సయ్యద్ కిర్మానీ-1109
కిరణ్ మోర్-901

# కుల్దీప్ యాదవ్ గైర్హాజరీపై కోచ్ క్లారిటీ




శ్రీలంక: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టుకు భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడు. అయితే అతడి గైర్హాజరీపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ క్లారిటీ ఇచ్చాడు. ఆరోగ్య సమస్య వల్లే రెండో టెస్టుకు కుల్దీప్ దూరమయ్యాడని కోటక్ స్పష్టం చేశాడు. మ్యాచ్‌కు ముందు కుల్దీప్ ఫిట్‌నెస్, గైర్హాజరీపై పలు ఊహాగానాలు రాగా.. కోటక్ వాటిని ఖండించాడు. యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించడానికి మేనేజ్‌మెంట్ ఎలాంటి అనవసర నాటకాలు ఆడాల్సిన అవసరం లేదన్నాడు. గాలేలో ఉన్నప్పుడే అతనికి తీవ్రమైన వైరల్ జ్వరం సోకిందని కోటక్ వెల్లడించాడు. కులదీప్ రెండు రోజులుగా నెట్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉండటానికి అధికంగా ప్రయాణం చేసి విశ్రాంతి లేకపోవడం కారణమని బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే గతంలో పేర్కొన్నాడు. తాజాగా కోటక్ మాటలు దానికి భిన్నంగా ఉండటం గమనార్హం. 'కుల్దీకి ఆరోగ్యం సరిగా లేనప్పుడు ఆడటం గురించి ఆలోచించడంలో అర్థం లేదు. లంక జట్టులో నలుగురు లెఫ్ట్ హ్యాండర్స్ ఉండటం, కులదీప్ అందుబాటులో లేకపోవడంతోనే మేం ఆఫ్‌స్పిన్నర్ సారాంశ్ జైన్‌కు అరంగేట్రం అవకాశం కల్పించాం' అని కోటక్ వివరించాడు. ప్రస్తుతం కులదీప్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని ఆయన తెలిపాడు. రెండో టెస్టులో వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్‌కు మరోసారి గాయమైంది. శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన బంతి పంత్ ఎడమ చేతి ముంజేతికి బలంగా తాకింది. నొప్పితో అల్లాడిన పంత్ కేవలం 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగారు. దీనిపై స్పందించిన కోటక్, పంత్ కోలుకుంటున్నాడని, రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశాడు.

# ఇంగ్లండ్ స్టార్ బౌలర్‌కు సంకెళ్లు




ఇంగ్లండ్: ఇంగ్లండ్ ఆటగాళ్లు తరచూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ ఉంటారు. గతంలో నైట్ క్లబ్ గొడవలో ఇంగ్లీష్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ చిక్కుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇంగ్లండ్ స్టార్ బౌలర్ బ్రైడన్ కార్స్‌కు సంబంధించి ఓ వార్త వైరల్ అవుతోంది. అతడిని డెర్బీలోని ఓ నైట్‌క్లబ్ వెలుపల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనికి సంబం ధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వీడియోలో కార్స్ చేతులకు వెనుకకు సంకెళ్లు వేసి, పోలీసు అధికారులు అతడిని చుట్టుముట్టి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే కార్స్‌ను అరెస్టు చేయలేదని, ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే విడుదల చేసినట్లు సమాచారం. దర్హామ్ జట్టు తరపున కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ ఆడిన అనంతరం జట్టు సభ్యులు విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోలో ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కూడా అక్కడే కనిపించడం మరింత చర్చకు దారితీసింది. దర్హామ్ జట్టు తరపున అదే మ్యాచ్‌లో ఆడిన స్టోక్స్.. డెర్బీషైర్‌పై జట్టు ఘన విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే నైట్‌క్లబ్‌లో జరిగిన ఘటన ఇంగ్లండ్ జట్టు అధికారిక కార్యక్రమంలో భాగం కాదని తెలుస్తోంది. దీనిపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు స్పందిస్తూ.. డెర్బీలో జరిగినట్లు సమాచారం అందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. దర్యాప్తు పూర్తయ్యే వరకు కార్స్‌పై తదుపరి చర్యల విషయమై స్పష్టత వచ్చే అవకాశం లేదు. మొత్తంగా ప్రస్తుతం కార్స్‌పై ఎలాంటి క్రిమినల్ అభియోగాలు లేవు. పోలీసులు అతడిని ఘటనాస్థలంలో తాత్కాలికంగా అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేసినట్లు స్థానిక రిపోర్టులు పేర్కొంటున్నాయి.




# విమర్శలకు రిప్లయ్ ఇచ్చిన జైస్వాల్

శ్రీలంక: టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మైదానంలో ప్రదర్శించే దూకుడుపై తాజాగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడు అసిత ఫెర్నాండోతో జైస్వాల్ వ్యవహరించిన తీరుపై కొందరు మాజీ ఆటగాళ్లు విమర్శించారు. భారత బ్యాటింగ్ కోచ్ సీతాంశు కోటక్ సైతం జైస్వాల్ అంతగా ఫెర్నాండోకు దగ్గరగా వెళ్లి ఉండాల్సి కాదని అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ జైస్వాల్ అద్భుతమైన ప్రతిభ ఉన్న ఆటగాడని, కాకపోతే ప్రత్యర్థుల మాటలకు రియాక్ట్ అవుతాడన్నారు. జైస్వాల్ ఇలాంటి చర్యలకు దిగకుండా తన ఆటపై దృష్టి పెట్టాలని ఓ వీడియోలో పేర్కొన్నారు. 'ప్రత్యర్థి ఆటగాడు రెచ్చగొట్టారు నిజమే, కానీ అతను(జైస్వాల్) కొంచెం హద్దు మీరి దగ్గరకు వెళ్లాడు' అని హర్షా భోగ్లే అభిప్రాయపడ్డాడు. ఈ వ్యాఖ్యలపై యశస్వి జైస్వాల్ సోమవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మరోసారి ఘాటుగా బదులిచ్చాడు. హర్షా భోగ్లే పోస్ట్ చేసిన వీడియోపై స్పందిస్తూ.. 'సదరు ఆటగాడు ఏమన్నాడో మీకు తెలియకుంటే.. ఇలాంటి తీర్పులు ఇవ్వడం ఆపండి. ఎవరైనా హద్దులు మీరి ప్రవర్తిస్తే.. భారత్ తిరిగి పోరాడుతుందని.. వాళ్లకు గట్టిగానే బదులు ఇస్తుందని చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని జైస్వాల్ కామెంట్ సెక్షన్‌లో తన అభిప్రాయాన్ని పంచుకుం టూ హర్షా భోగ్లేకు కౌంటర్ ఇచ్చాడు.

# ఓడినప్పటికీ బంగ్లాదేశ్ బౌలర్ రికార్డ్



బంగ్లాదేశ్: మెకే వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఘోర ఓటమిని చవిచూసిన సంగతి తెలిసిందే. ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో బంగ్లా ఓటమి పాలైంది. ఇదే సమయంలో ఆ జట్టు ఎడమచేతి వాటం పేసర్ షోరిఫుల్ ఇస్లామ్ అరుదైన రికార్డు సాధించాడు. అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్‌ను షోరిఫుల్ దెబ్బ తీశాడు. ఈ పేసర్ 15 ఓవర్లలో 48 పరుగులే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో 140 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో కంగారు జట్టుపై ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన తొలి ఎడమ చేతి వాట పేసర్‌గా షోరిఫుల్ నిలిచాడు. గతంలో ఇంగ్లండ్‌కు చెందిన ఎడమ చేతి వాటం పేసర్ డిక్ బార్లో ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీశాడు. 1886లో మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో బార్లో 44 పరుగులే ఇచ్చి.. 7 వికెట్లు సాధించాడు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఏ ఎడమచేతి వాటం పేసర్ కూడా ఆస్ట్రేలియాపై ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లను సాధించలేదు.

140 ఏళ్ల తర్వాత తాజాగా షోరిఫుల్ ఇస్లామ్ ఆ అరుదైన ఫీట్‌ను సాధించాడు. అయితే ఆస్ట్రేలియాపై టెస్టుల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకం మాత్రం ఇంగ్లండ్ దిగ్గజం జిమ్ లేకర్ పేరిట ఉంది. 1956 జూలైలో మాంచెస్టర్‌లో జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో లేకర్ మొత్తం 10 మంది కంగారు బ్యాటర్లను కేవలం 53 పరుగులకే ఔట్ చేశాడు. మరోవైపు షోరిఫుల్ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో బంగ్లా దారుణ ఓటమిని చవిచూసింది. దీంతో రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్ 1-1తో ముగిసింది.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 25 ఆగస్టు 2026
IX




## ‘మిరాయ్’కు జపాన్‌లో సెన్సేషనల్ రెస్పాన్స్

తేజ సజ్జా హీరోగా తెరకెక్కిన ‘మిరాయ్’ సినిమా జపాన్‌లో సత్తా చాటుతోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా.. పాన్ ఇండియా స్థాయిలో ఎంతగా విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడీ చిత్రం జపాన్లో కూడా విడుదలైంది. ఈ నెల 21న అక్కడ విడుదలైన ఈ సినిమా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. విడుదలైన తొలి వీకెండ్‌లోనే అక్కడ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. పలు భారీ జపనీస్, అంతర్జాతీయ చిత్రాలతో పోటీపడి అదిరిపోయే ప్రదర్శన కనబరుస్తోంది. ముఖ్యంగా ‘స్పైడర్‌మ్యాన్’ వంటి భారీ ఫ్రాంచైజ్ మూవీని సైతం అధిగమించడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తొలి వీకెండ్‌లోనే ఈ స్థాయి స్పందన రావడం చిత్ర బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. తేజ సజ్జా గతంలో ‘హనుమాన్’ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ‘మిరాయ్’తో మరోసారి అంతర్జాతీయ మార్కెట్‌లో తన క్రేజ్‌ను చాటుకుంటున్నారు. ముఖ్యంగా జపాన్ ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో రూపొందిన ‘మిరాయ్’పై ఇండియాలోనే కాకుండా ఓవర్సీస్ మార్కెట్లలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

## శ్రేష్టి వర్మ డ్యాన్స్‌తో దుమ్మురేపింది

మూవింగ్ డ్రీమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రూపొందుతున్న సరికొత్త చిత్రం ‘ధర్మస్థల నియోజకవర్గం’. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో, మేరుం భాస్కర్ నిర్మాణంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి విడుదలైన ‘న్యాయం చేయరా దేవుడా’ థియేట్రికల్ ఎక్స్‌టెండెడ్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం అందించగా.. ఆయన చేతుల మీదుగానే విడుదలైన ఈ పాటకు శ్రేష్టి వర్మ డ్యాన్స్ చేయడంతో పాటు, స్వయంగా కొరియోగ్రఫీ చేయడం విశేషం. స్టార్ సింగర్ సునీత ఉపద్రష్ట తన మధురమైన, హుషారైన



గాత్రంతో ఆలపించగా, మహావీర్ యేలేందర్ అదిరిపోయే మాస్ బీట్‌ను సమకూర్చారు. ఈ ప్రత్యేక గీతంలో శ్రేష్టి వర్మ తన అందచందాలు, అదిరిపోయే స్టెప్పులతో యూత్‌ను ఉర్రూతలూగించింది. ‘మైసూరు ప్యాలెస్‌లోన ఉండాల్సిందాన్ని.. మామూలు ఇంటిలోన ఉంటున్నాను.. రోల్స్ రాయిస్ కార్లోన ఎక్కాల్సిందాన్ని.. రోడ్డు సైడు ఆటోలోన పోతున్నాను.. న్యాయం చేయరా దేవుడా నాలోని అందాలకు’ అంటూ



సాగే సాహిత్యంలో తనదైన నాటీ ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో స్టేజ్‌పై దుమ్మురేపింది. శ్రేష్టి గ్లామర్ ప్రెజెన్స్, మాస్ బీట్‌కు తగ్గట్టుగా వేసిన ఫాస్ట్ స్టెప్పులు, గ్రేస్ మూమెంట్స్ వీడియో మొత్తానికే హైలైట్‌గా నిలిచాయి. వారాహి మ్యూజిక్ ద్వారా విడుద లైన ఈ వీడియో సాంగ్ లాంచ్ కార్యక్రమంలో చంద్రబోస్‌తో పాటు ఆయన తనయుడు నంద వనమాలి, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొని సందడి చేశారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న పివిఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# జక్కన్నతో అట్లుంటది మరి!

దర్శధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటోన్న ప్రతిష్టాత్మక పాన్ వరల్డ్ మూవీ ‘వారణాసి’. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే టాలీవుడ్‌లోనే కాకుండా గ్లోబల్ రేంజ్‌లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇక ఆ తర్వాత విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, సాంగ్, అలాగే మహేష్ బాబు బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై ఉన్న హైప్‌ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఈ విజువల్ వండర్ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ బిగ్ ప్రాజెక్ట్‌లో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. శ్రీ దుర్గ ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై కేఎల్ నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఆస్కార్ విజేత ఎమ్.ఎమ్. కీరవాణి సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి సోషల్ మీడియాలో ఒక సంచలన వార్త వైరల్ అవుతోంది.





‘వారణాసి’ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసే విషయంలో జక్కన్న ఒక పక్కా మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళుతున్నారట. దాదాపు 120 దేశాల్లో ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తుండగా... అందులో ఏకంగా 50 దేశాల్లో ఒకేసారి రిలీజ్ చేసేలా ఇప్పటినుంచే భారీ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ‘వారణాసి’ గ్లోబల్ మార్కెట్‌ను రీచ్ అవ్వాలంటే భాష చాలా కీలకమైన అంశం. అందుకే ఈ సినిమాను దాదాపు 50 భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేయాలని రాజమౌళి నిర్ణయించుకున్నట్లు టాక్. ప్రస్తుతం ఉన్న ఏఐ లేదా సింథటిక్ వాయిస్ టెక్నాలజీతో నటీనటులు ఏ భాషలో నైనా మాట్లాడినట్లు సులభంగా చేయవచ్చు. కానీ రాజమౌళి మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఆలోచిస్తున్నారు. ప్రేక్షకులు ఏ దేశంలో ఉన్నా, ఏ భాషలో చూసినా ఆ పాత్రల సంభాషణలు అత్యంత సహజంగా అనిపించాలన్నదే జక్కన్న లక్ష్యం. అందుకే ఏ× కి స్వస్తి చెప్పి, ప్రతి భాషకు ఒరిజినల్ వాయిస్ ఆర్టిస్టులనే ఉపయోగించాలని డిసైడ్ అయ్యారట. డబ్బింగ్‌ను కేవలం డైలాగ్‌ల అనువాదంగా కాకుండా, సినిమా ఆత్మగా భావించే రాజమౌళి.. దాదాపు 1500 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను పిలిపించి ఆడిషన్లు నిర్వహించబోతున్నారని సమాచారం. ప్రతి పాత్రకు సరిగ్గా సరిపోయే గొంతును ఎంపిక చేయడం సవాలే అయినప్పటికీ, క్వాలిటీ విషయంలో జక్కన్న ఏమాత్రం కాంప్రమైజ్ కావడం లేదట.

‘బాహుబలి, ఆర్ఆర్ఆర్’ చిత్రాలతో తెలుగు సినిమా స్థాయిని ఆస్కార్ వేదిక వరకు తీసుకెళ్లిన రాజమౌళి, ఇప్పుడు ‘వారణాసి’తో అంతకుమించిన గ్లోబల్ బెంచ్‌మార్క్ క్రియేట్ చేయడానికి సిద్ధమయ్యారు. ఇండియన్ సినిమాలో ఇప్పటివరకు చూడని విధంగా ఈ మూవీని ఒక మైండ్ బ్లోయింగ్ విజువల్ ఫీస్ట్‌గా మలుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుపుకుంటోన్న ఈ ‘వారణాసి’ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. మరి ఈ మూవీతో జక్కన్న-మహేష్ బాబు కాంబో ఎలాంటి హిస్టరీ క్రియేట్ చేయబోతుందో చూడాలి.

# జేడీ చక్రవర్తి నెంబర్ వన్ ఫ్రాడ్ 420

**- నటుడు సురేష్ కామెంట్స్**

టాలీవుడ్ సీనియర్ నటుడు సురేష్ ఇటీవల ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో తన సుదీర్ఘ సినీ ప్రయాణం, తోటి నటీనటులతో తనకున్న వ్యక్తిగత బంధంపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా విలక్షణ నటుడు, దర్శకుడు జేడీ చక్రవర్తితో ఉన్న సాన్నిహిత్యం గురించి సురేష్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మాటల సందర్భంలో జేడీని తాను ఎంతో చనువుగా ‘నెంబర్ వన్ ఫ్రాడ్ 420’ అని పిలుస్తుంటానని సురేష్ సరదాగా పేర్కొన్నారు. ఈ సరదా కామెంట్ వారిద్దరి మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహాన్ని, చనువును తెలియజేస్తోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జేడీ చక్రవర్తి మనస్తత్వం చాలా భిన్నంగా, ప్రత్యేకంగా ఉంటుందని సురేష్ వివరించారు. “జేడీ మనసులో ఏ ఆలోచన ఉందో, తర్వాత క్షణంలో ఆయన ఏం చేస్తారో ఎవరూ ముందే ఊహించలేరు. ఆఖరికి జేడీకి కూడా తన మైండ్‌లో ఏముందో ఆయనకే తెలియదేమో” అంటూ సురేష్





నవ్వులు పూయించారు. తామిద్దరం కలిసినప్పుడు ప్రతి విషయాన్ని ఎంతో నిష్కల్మషంగా, ఓపెన్‌గా మాట్లాడుకుంటామని.. పరస్పరం వేసుకునే సెటైర్లు, విమర్శలను చాలా స్పోర్టివ్‌గా తీసుకుంటామని చెప్పారు. సినిమా ఇండస్ట్రీలో ఇలాంటి అహం లేని, నిజాయితీతో కూడిన స్నేహాలు దొరకడం చాలా అరుదని పేర్కొన్నారు. జేడీతో పాటు జగపతి బాబు, సుమన్, శ్రీకాంత్, ఉత్తేజ్ వంటి వారితో కూడా తనకు ఎంతో కాలంగా మంచి స్నేహబంధం కొనసాగుతోందని గుర్తుచేసుకున్నారు. ఇక తన సెకండ్ ఇన్నింగ్స్ పాత్రల ఎంపికపై సురేష్ ఆసక్తికరమైన స్పష్టతనిచ్చారు. సినిమా చివర్లో వచ్చి జస్ట్ కనిపించి ‘శుభం కార్డు’ వేసే రబ్బర్ స్టాంప్ లాంటి బలహీనమైన పాత్రలు చేయడం తనకు ఏమాత్రం ఇష్టం ఉండదని కుండబద్దలు కొట్టారు. కేవలం స్క్రీన్ స్పేస్ కోసమే కాకుండా, నటనకు ఆస్కారం ఉండి కథను మలుపు తిప్పే బలమైన విలన్ లేదా నెగెటివ్ షేడ్స్ ఉన్న వైవిధ్యమైన పాత్రలు చేయడానికే తాను అధిక ప్రాధాన్యత ఇస్తానని సురేష్ స్పష్టం చేశారు. ఆయన చేసిన ఈ బోల్డ్ అండ్ ఫ్రాంక్ కామెంట్స్ ప్రస్తుతం ఫిలిం వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# ‘రంభ ఊర్వశి మేనక’ ట్రైలర్ రిలీజ్

కామెడీ కింగ్ గా ఒకప్పుడు పేరు తెచ్చుకున్న అల్లరి నరేష్ గత కొన్నేళ్లుగా సీరియస్ కథాంశాలతో అలరిస్తూ వస్తున్నాడు. సినిమాలు చేస్తున్నాడు కానీ, ఆశించిన ఫలితాలను మాత్రం అందుకోలేకపోతున్నాడు. ఇక ఈ సారి మాత్రం మంచి హిట్ కొట్టాలని కామెడీ కింగ్ అల్లరి నరేష్ మళ్లీ తన సొంత జోనర్ అయిన అవుట్ అండ్ అవుట్ ఫన్ అండ్ ఫాంటసీ వైపు అడుగులు వేశాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 65వ చిత్రం రంభ ఊర్వశి మేనక. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి చంద్రమోహన్ చింతడ దర్శకత్వం వహించాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి




రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మేకర్స్ తాజాగా రంభ ఊర్వశి మేనక ట్రైలర్‌ని రిలీజ్ చేశారు.

చిన్నతనం నుంచి సూరి(అల్లరి నరేష్) దేవలోకం నుంచి రంభ, ఊర్వశి, మేనక అనే ముగ్గురు అప్సరస లు భూమిపైకి వచ్చి తన కోరికలు తీరుస్తాడని నమ్ముతూ ఉంటాడు. ఇక రంభ, ఊర్వశి, మేనక.. దేవేం ద్రుడికి తెలియకుండా సూరి కోసం దిగివస్తారు. ఈ విషయం తెలుసుకున్న దేవేంద్రుడు.. వారి ముగ్గురు శక్తులను కోల్పోయేలాగా చేస్తాడు. దీంతో సూరి ఆశలు ఆవిరైపోతాయి. అసలు సూరి కోసం రంభ, ఊర్వశి, మేనక ఎందుకు దిగి వచ్చారు? వారు వచ్చాక ఎదురయ్యే విచిత్రమైన, హాస్య భరితమైన పరిస్థితులు ఏంటి? సూరిపై దేవేంద్రుడికి ఉన్న కోపం ఏంటి? అసలు సూరి కోరికలు ఏంటి? అనేది సినిమా చూసి తెలుసోకవాల్సిందే. ట్రైలర్‌లో అల్లరి నరేష్ తన మార్క్ టైమింగ్, పంచ్ డైలాగులు, అలాగే దర్శకుడు బోయపాటి శ్రీను సిగ్నేచర్ హావభావాలను ఇమిటేట్ చేస్తూ చెప్పిన డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివర్లో.. ఓజీ సినిమాలోని వాషీ .. ఓ వాషీ డైలాగ్‌ని నరేష్ తనదైన రీతిలో ఇమిటేట్ చేసి నవ్వులు పూయించాడు. పదేళ్లుగా నరేష్ కామెడీని మిస్సయిన అభిమానులకు ఈ చిత్రం పూర్తిస్థాయి వినోదాన్ని అందిస్తుందని ట్రైలర్‌ని బట్టి తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్, చైతన్ భరద్వాజ్ సంగీతం ఫాంటసీ మూడ్‌కి తగ్గట్లుగా కుదిరాయి. మరి ఈ సినిమాతో అల్లరి నరేష్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.